ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
06 నవంబర్, 2011

Entered

డిజిటల్ హల్‌చల్

హ్యాపీబర్త్‌డే

(2011 నవంబర్ 6నుంచి
2011 నవంబర్ 12 వరకు)

వి.చంద్రిక
నవంబర్-10
హైమ-వెంకటేశం
ఆర్‌బినగర్-భువనగిరి

జి. మహోన్నత
2సం॥, నవంబర్-2009
అలివేలు-యాదగిరి
మేడిపల్లి-రంగారెడ్డి

ఎం.శ్రావణ్(చిన్నా)
1సం॥, నవంబర్-2010
వినోద-జైల్‌సింగ్
కూసుమంచి-ఖమ్మం

సత్యసాయి అనీష్
1సం॥, నవంబర్-2010
సంధ్య-శ్యాంసుందర్
న్యూనల్లకుంట-హైదరాబాద్

కె. కావ్యశ్రీ
నవంబర్-6
నాగమణి-జంగయ్య
శాబ్దుల్లాపురం-నల్లగొండ

కె. రాధాకృష్ణ
9సం॥, నవంబర్-2002
వనజ-శ్రీనివాసు
మెటుపల్లి-కరీంనగర్

ఎన్. నిహాల్‌సాయి
నవంబర్-7
లావణ్య-చంద్రశేఖర్
వెలిమినేడు-నల్లగొండ

కె. జయశ్రీ
నవంబర్
కృష్ణవేణి-మురళి
కర్నూలు

జె.సాహ్రుతిక
నవంబర్-6
స్వర్ణమాల-కుమారస్వామి
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్



బి.లక్ష్మీ లతీష
నవంబర్
రోజ-వెంకటరమణ
అనంతపురం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి అన్నట్టు కలర్ ఫొటో జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి ఫొటో వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

ఆశ... దోశ...

'అదిగో పులి అంటే- ఇదిగో తోక' అనటం చాలామందికి ఊహతో పెట్టిన విద్య. మనిషికి మొదటినుంచీ అలాంటి లక్షణం ఉండడం వల్లే కాబోలు- బోలెడన్ని సామెతలు పుట్టుకొచ్చాయి. ఎద్దు ఈనిందంటే- దూడను కట్టేయమనటం వంటివి దీన్లో భాగాలే! విన్న వెంటనే ఇంత దూకుడు ఎందుకూ? అంటే- వెనకాముందూ ఆలోచించకపోవడం వల్లే..! అందుకనే 'వినినంతనే వేగపడక ...' అని శతకకారుడు చెవిలో పద్యం కట్టి పాడాడు. అయినా... వినిపించుకున్నదెవరు? అలా విని ఉంటే- విగ్రహాలు పాలు తాగేవి కావు, కోట్ల లీటర్ల పాలు నేలపాలు అయ్యేవి కావు. ఫొటోల్లోంచి విభూతి రాలటం, పంది దైవ ప్రదక్షిణం చేయడం వంటివి జరిగేవి కావు.

నిన్నగాక మొన్న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ... 'పోస్టాఫీసులో ఖాతా ఉంటే చాలు- వచ్చి వాలు వేలకు వేలు' అని ప్రచారం జరిగింది. గాలి జనార్ధనరెడ్డి, జగన్, సత్యసాయి ట్రస్టు కూడబెట్టిన అక్రమ సొమ్ము ఇలా జనానికి పంచే పథకం ఒకటి ప్రారంభం అవుతుందనేది ఆ ప్రచారంలోని ప్రధాన అంశం. అంతే...! క్షణాల్లో జనం ఖాతాలు తెరవటానికి పోస్టాఫీసుల ముందు క్యూ కట్టారు. 'వస్తే కొండ ... పోతే వెంట్రుక' అన్న లెవెల్లో బారులు తీరారు. 'అక్రమార్కుల ఖాతాల్లోకి చేరిన సొమ్ము అప్పనంగా జనం ఖాతాల్లోకి వస్తుందా? కొంతయినా ఆలోచించలేకపోయారా?' అని వారిని ప్రశ్నిస్తే- 'అవును... అది మాకూ తెలుసు.... కాకపోతే, నలుగురితో పాటు నారాయణ' అని ముసిముసి నవ్వులు రువ్వారు. పెట్రో ధరలు పెరిగినప్పుడో, సరుకులు ఆకాశంలోకి ఎగసినప్పుడో, ఆస్తిపన్ను విపరీతంగా పెంచినప్పుడో ... జనంలో ఇలాంటి సంఘీభావం, ఐకమత్యం ఉంటే బాగుణ్ణు...! అసలు అలాంటి చైతన్యమే ఉంటే- అక్రమార్కుల ఖాతాల్లోకి కోట్లు చేరనే చేరవు... ప్రజాధనం పెడదారి పట్టనే పట్టదు... ఎత్తుకుపోయిన సొత్తుకోసం అంగలార్చటం కన్నా- అలాంటి విపత్తు తలెత్తకముందే గళమెత్తటం మేలు కదా ....!!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	4
ఎవరి గోల వారిదే	...	6
రుచి	...	10
తెలుసుకుందామా	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
చిన్నకథ	...	18
కొత్త పుస్తకాలు	...	19
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు 3
వెండితెరపై పాశ్వాన్ వారసుడు

కథ ... 8
ఓ వెంకటేష్ కథ

'వన్'డర్ దే! ... 13

వికాసం ... 20
విటమిన్ల విశేషాలు



కళ్లకు కట్టిన 'వాల్‌స్ట్రీట్'

అట్టమీది కథ 'వాల్‌స్ట్రీట్ పోరు... విశ్వమంతా హోరు' లో వాల్‌స్ట్రీట్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. ముఖచిత్రం బాగుంది. ఏతమేసి తోడితే ఏరు నిండుతుందో లేదో తెలీదు కానీ ఎంత వెతికినా 'జనం మెచ్చిన జాలాది' దొరకడు. పురుషులందు జాలాది వేరయా. గాలి, యడ్యూరప్ప, రాజా, కనిమొళి గతంలో దేశప్రజలందర్నీ అమావాస్య చీకట్లో వదిలేసి వాళ్లు మాత్రం దీపావళి పండుగ చేసుకున్నారు. ఇప్పుడు జైల్లో కూడా పండుగ చేసుకోవడం అవసరమా?

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

చాలా రోజులు...

కొత్త పుస్తకాల్లో 'ఓ ధీరోదాత్తుని దినచర్య' చదివాక ఈ పుస్తకం ఎప్పుడెప్పుడు చదివేద్దామా అనిపించింది. 'వికాసం'లో మన ఆలోచనలను బట్టే మన ప్రవర్తన ఉంటుందని శర్మ గారు ఎన్నో విషయాలు వివరించారు. 'అట్టమీది కథ' వాల్‌స్ట్రీట్ పోరు... విశ్వమంతా హోరు బాగుంది. వాల్‌స్ట్రీట్‌లో నేడు జరుగుతున్న పరిణామాల్ని తెలుసుకోడానికి ఈ వ్యాసం చదివితే సరిపోతుందనిపించింది. రచయితకు ధన్యవాదాలు. 'పాత కథ' శీర్షికలో దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి 'అవ్వ తిరునాళ్లలో తప్పిపోయింది' కథ నవ్వు తెప్పించింది. ఇలాంటి కథ చదివి చాలా రోజులయింది. అప్పటి రచయితల కథలను ఇలా అప్పుడప్పుడు పునఃప్రచురిస్తే బాగుంటుంది.

ఎస్.ఆర్. కుమార్,
విజయనగరం.

సరైన అవగాహన

దీపావళి కార్టూన్లు బాగున్నాయి. 'ఈ పేజ్‌లో నన్ను శుభ్రం చేయండి... ప్లీజ్!! వ్యాసం బాగుంది. నేడు చాలా వరకు అందరి ఇళ్లలో కంప్యూటర్లు ఉంటున్నాయి. అవి ఎప్పుడైనా పని చేయడం లేదంటే ఏం పాడైపోయిందో అనుకుంటాం. కానీ క్లీన్ చేయకపోయినా పాడైపోతాయని చాలా మందికి తెలియదు. వాటిని శుభ్రం చేయడం అంటే ఏదో పైపైన తుడుస్తాం. అయితే అందులో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో ఈ వ్యాసం ద్వారా తెలుసుకున్నాం. 'చూద్దామా'లో సైకిల్ రిక్షాలు ఆకర్షించాయి.

బి.ఎస్.శర్మ, విజయవాడ.

అందరి జాలాది

సినిమా కబుర్లలో 'జనం మెచ్చిన జాలాది' అలరించింది. గేయ రచయితలు ఎంతమంది ఉన్నా కొందరు మాత్రం కలకాలం గుర్తుండిపోతారు. అలాంటి వాళ్లలో జాలాది ఒకరు. ఆయన పాటల్లో నాడు నేడు... ఎప్పటికీ అందరూ పాడుకునేది 'ఏతమేసి తోడినా ఏరు నిండదు... పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు...' పాట. నేటి పిల్లలకు సైతం బాగా తెలిసింది 'పుణ్యభూమి నా దేశం... పాట. ఇవి ఎప్పటికీ నిత్య నూతనాలే.

రామకృష్ణ, కొత్తగూడెం.

తప్పక చదవాల్సిన వాల్‌స్ట్రీట్

అట్టమీది కథ బాగుంది. అసలు వాల్‌స్ట్రీట్ ఎలా మొదలైంది, దాని చరిత్ర, కార్పొరేట్ సంస్కృతి ఎలా మొదలైంది... వంటి విషయాలు చక్కగా వివరించారు. అక్కడే ఎందుకు పోరాటం చేస్తున్నారు? పోరాటాన్ని అణగదొక్కే ప్రయత్నాలు... వంటి అనేక విషయాలపై అవగాహన కలిగింది. అందరూ తప్పక చదవాల్సిన వ్యాసమిది. 'ఈ పేజ్‌లో కంప్యూటర్ వాడకంపై కనీసావగాహన కలిగించారు. 'మనలో మాట'లో చెప్పినట్లు నిత్యం పెరిగే ధరలతో చెవులు చిల్లులు పడే మోత మోగుతుంటే మళ్లీ ప్రత్యేకంగా దీపావళి సంబరాలు జరుపుకోలేరు. పండగ చేసుకోగలిగేది భూబకాసురులు, కోట్లకు పడగెత్తిన కుబేరులు మాత్రమే.

సత్య, ఒంగోలు.

అలరించిన సింగపూర్

'చూద్దామా'లో సింగపూర్ సింగారాలు' ఆకట్టుకుంది. మలేషియా యాత్రికులను సింగపూర్ కనువిందు చేస్తుంది. రకరకాల సీతాకోక చిలుకలు, రంగురంగుల పక్షులు, ఎత్తైన పర్వతాలు అలరిస్తున్నాయి.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

స్టీవ్ జ్ఞాపకాలు

గత వారం స్నేహలో 'ప్రత్యేకం' ద్వారా విజయ్ స్టీవ్‌జాబ్స్ జ్ఞాపకాల్లో తేలియాడించారు. కొత్తపుస్తకాల్లో 'ఉపాధ్యాయుడు ఎలా ఉండాలి?' అన్న పుస్తకాన్నీ టీచర్లందరూ తప్పక చదివి తీరాలనిపించింది. ఆడ,మగ లక్షణాలకు మూలకారణమేంటో 'వికాసం' ద్వారా తెలుసుకున్నాం. 'కవితలు' చైతన్యపూరితంగా ఉన్నాయి. 'సినిమా కబుర్లు' వాస్తవాల్ని చెప్పింది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

హాస్య కథ

'అవ్వ తిరునాళ్లలో తప్పిపోయింది' కథ హాస్యాన్ని పరిమళింపజేసింది. 'అట్టమీది కథ' వాల్‌స్ట్రీట్ పుట్టుపూర్వోత్తరాల్ని తెలియజేసింది. 'వికాసం'లో శర్మ చెప్పినట్లు ఆడైనా, మగైనా అర్థం చేసుకుని, అమలు చేసుకుంటే ఏ సమస్యలూ రావు. ప్రకృతిలో అన్నీ మంచివే. ఏవీ అపశకునం కాదని చివరి పేజీ కథ ద్వారా తెలియజేశారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
విజయవాడ.



సినిమా కబుర్లు

మనకో సిద్ధాంతం కాని సిద్ధాంతం చెలామణీలో ఉంది. అదేంటంటే... 'డాక్టరు కొడుకు డాక్టరు, ఇంజనీరు కొడుకు ఇంజనీరు, యాక్టరు కొడుకు యాక్టరు, రాజకీయ నాయకుని కొడుకు రాజకీయ నాయకుడు' అన్నది! అదే ఒరవడిలో సాగిపోతే మనం ప్రత్యేకంగా చెప్పకోం. దానికి భిన్నంగా నడిస్తేనే విషయం మన కంటిని ఆకర్షిస్తుంది. ఇప్పుడు మనం మాట్లాడుకోబోయేది అలాంటివారి గురించే! రామ్‌విలాస్ పాశ్వాన్ రాజకీయ నాయకుడని అందరికీ తెలుసు. కానీ ఆయన తనయుడు చిరాగ్ పాశ్వాన్ మాత్రం 'నాకెందుకొచ్చిన కుళ్లు రాజకీయాలు. అంటుకుంటే బురద వదలదు. దురద తగ్గదు' అనుకున్నాడో ఏమో బాలీవుడ్‌వైపు కన్నేశాడు. 'మిలే నా మిలే హమ్' సినిమా ద్వారా అతగాడు వెండితెరపై కనిపించనున్నాడు. ఈ విషయమై ఏమంటున్నారో చిత్తగించండి మరి!

వెండి తెరపై పాశ్వాన్ వారసుడు

'ఇది చిన్ననాటినుండీ నా మనసులో అల్లుకున్న కల. సినిమాల్లో నటించాలన్నది నా జీవితాశయం. నాకు రాజకీయ నేపథ్యం ఉన్నదేమో గానీ, నా దృష్టంతా వెండితెరవైపే!

వారసత్వాన్ని అందుకోవాలని తండ్రులు కోరుకోవడం సహజం. అయితే నా ఆకాంక్ష వారికి చెప్పకనే అర్థమైంది. చిన్ననాటినుండి నా వేషాలు అంటే పాఠశాలల్లో, కాలేజీల్లో నాటకాల్లో వేషాలు వేయడం చూసి వారే తెలుసుకున్నారు.

నేను రాజకీయరంగాన్ని వదిలి సినీరంగాన్ని ఎంచుకున్నందుకు నేనేమీ బాధపడటంలేదు. అయినా నా బ్యాక్‌గ్రౌండ్ చూసి నాకెవరూ ఛాన్సులివ్వరు. ఇక్కడ మన టేలెంటును మనమే నిరూపించుకోవాలి. కేవలం సినిమాలనే కాదు, ఏ రంగాన్ని ఎంచుకున్నా మన స్వశక్తితో విజయాన్ని అందుకోవాలన్నది నా అభిప్రాయం. లేకుంటే వెళ్లినదారినే తిరుగుముఖం పడతారు. చెప్పాలంటే, ఆ తిప్పలు కూడా నాకు అనుభవమే. ఎట్టకేలకు అనుజ్ సక్సేనా మా కుటుంబానికి సన్నిహితుడు కావడంతో నాకీ ఛాన్సిచ్చాడు.

నిజానికి నాకీ అవకాశం దొరికినపుడు నేను మానసికంగా సన్నద్ధంగా లేను. నేను రంగులప్రపంచమైన ముంబయికి అడుగుపెట్టడానికి ఏడాదిన్నర సమయం తీసుకున్నాను. ఈ సినిమాకోసం టెన్నిస్ కూడా నేర్చుకున్నాను తెలుసా?! మామూలుగా కాదు, ఎనిమిది నెలలపాటు రోజుకు 8-10 గంటలు ప్రాక్టీస్ చేశాను.

కంగనా రౌనత్, నీరూ భజ్వా, సాగరికే ఘాటే వంటి నటీమణులతో నటించడమంటే మాటలు కాదు. వాళ్లు నాకెంతో సహకారం అందించారు.

కొత్తగా ఈ రంగంలోకి అడుగుపెట్టినపుడు ఉండే కంగారు నాలో పెద్దగా లేదనే చెప్పాలి. నా తోటినటులంతా చాలా కోపరేట్ చేసేవారే. గోవాలో కంగనాతో సన్నిహితంగా నటించాల్సివచ్చినపుడే కొద్దిగా ఇబ్బందిగా అనిపించింది. పైగా అది నడిరోడ్డుమీద ప్రజాసమూహం మధ్యలోనయ్యే! ఫర్వాలేదు, మొత్తానికి మేనేజ్ చేసేశాను.

రాజకీయాల్లో చేరాలనుకుంటున్నారా అని అడిగితే మాత్రం నేనిప్పుడే ఏం చెప్పలేను. అయితే రాజకీయాలు మా కుటుంబాన్ని నడిపిస్తున్నాయనే మాటైతే నిజమేగా!

నా ప్రథమ ప్రాధాన్యత సినిమాలకే. నేనిక్కడ కనీసం పది నుండి పదిహేనేళ్లు తిష్ట వేద్దామనుకుంటున్నాను.

ఈ సినిమా ప్రచారంకోసం పాట్నా అంటే మా సొంతూరునుండి మొదలెట్టాం. తర్వాత ఢిల్లీ, జైపూర్, నీరూ స్వంత ప్రాంతమైన పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలు తిరిగాం.

బాలీవుడ్‌లో నాకెవరు రోల్‌మోడల్ అని అడిగితే మరో ఆలోచన లేకుండా అమితాబ్ బచ్చన్ అనే చెబుతాను. ఆయనో విజ్ఞానగని. నేను షారుఖ్‌ఖాన్ 'దిల్‌వాలే...', సల్మాన్‌ఖాన్ 'హమ్ ఆప్‌కే హై కౌన్' చూస్తూ పెద్దవాడినయ్యాను. తారామణుల్లో నాకు కత్రినా, ప్రియాంక, దీపికా, కరీనాలలో ఒకరిని తేల్చిచెప్పాలంటే నాకు మహా కష్టం"

ఏదేమైనా రాజకీయాలనుండి తళుకుబెళుకుల రంగులలోకానికి చిరాగ్ విచ్చేస్తున్నాడు. ఈ 26యేళ్ల చిరాగ్ డెబ్యూట్ మూవీ 'మిలే నా మిలే హమ్ ఈ వ్యాసం అచ్చయ్యేసరికి థియేటర్లలో ఆడుతుండొచ్చు. ఇది కేవలం రొమాంటిక్ సినిమానే కాదట, ఒక సీరియస్ విషయం కూడా ఉందట. 'సంప్రదాయక కుటుంబాలలోని పిల్లలు, వారి భావోద్వేగ ప్రయాణమే మా కథ' అని చిరాగ్ చెబుతున్నాడు. మరి ఈ తారాలోకంలో చిరాగ్ చిరకాలం తళతళా మెరుస్తాడో, లేదో వేచిచూద్దాం! ★

కవిత్వమ్

డ్రైవరన్నా నమస్తే

డ్రైవరన్న స్టీరింగు పట్టకుంటే
ఎక్కడి వారక్కడే స్టాపు!
ఎక్కడి వస్తువులు అక్కడే స్టాకు!
బండెక్కి స్టీరింగు పడితే
పగలూ, రాత్రీ తేడా లేదు
ఊరూ వాడా తెలియదు
కళ్లు అలసినా
ఒళ్లు సొలసినా
విశ్రాంతి లేదు
గమ్యం చేరేవరకూ
ప్రాణానికి దిక్కేలేదు
రోజుల తరబడి భార్యాపిల్లలకు దూరం

సగం జీవితం రోడ్లకే అంకితం
రేయింబవళ్లు శ్రమించినా
విసుర్లు... కసుర్లు అనివార్యం

వాహనాల సారథుల జీవితాలు
దశాబ్దాలుగా ఎదుగూ బొదుగూ లేకుండా
దుర్భర జీవితాలు గడుపుతున్నారు
రోడ్డు ప్రమాదాలలో సమిధలుగా మారుతూ
నమ్ముకున్న కుటుంబాలకు దిక్కులేని వారిని
చేసి... కష్టాలను కన్నీళ్లను మిగుల్చుతున్నారు
దినదిన గండాల ప్రయాణం వారిది
దేశమంతా గిర్రున తిరిగే నైపుణ్యం ఉన్నా
సంసారాన్ని గట్టెక్కించలేని దైన్యం వారిది
మదిలో మెదిలే భార్యాపిల్లలు ఒకవైపు...!
రోడ్డు మీద ఎదురొచ్చే మృత్యుఘంటికలు మరోవైపు!
దశాబ్దాలపాటు అవిశ్రాంతంగా పనిచేసి
లేటు వయసులో వెనక్కి తిరిగి చూసుకుంటే
వారికి మిగిలేది భరోసా లేని జీవితం!

- మంత్రి లక్ష్మీనారాయణ

హైకూలు

అప్పులు పుట్టెడు
అవస్థలు గంపెడు
గింజలు గుప్పెడు

ప్రతీ మహిళ
లక్షాధికారి
డ్వాక్రా అప్పులు

సెజ్ అమ్మోరు
ఊరు మీద పడింది
ఎకరాలు నైవేద్యం

కల్లంలో పంట
గిట్టుబాటుకు
పోరుబాట

ఆకాశంలో ధరలు
పాతాళంలో వేతనాలు
మధ్యలో మూగజీవులు

ఒకప్పుడు ఓలి
నేడు కట్నం
బలిపీఠంపై వధువు

ఎండిన చేను
నీరులేని కాలువ
వారి చలువే

తప్పటడుగుల వీపున
పుస్తకాల దరువు
కాన్వెంటు బాలశిక్ష

అవినీతి అంతం
అందరి పంతం
నీతికి కట్టండి పట్టం

గనులు
తవ్వుకు పోయారు
గోతులు మిగిలాయి

ఆరోగ్యశ్రీ టానిక్
ఫలితాన్నిచ్చింది
కార్పొరేట్ బలిసింది

మందూమాకూ లేని
అనాథ
ధర్మాసుపత్రి

వర్షాల కోసం
యజ్ఞాలు ఆపండి
మొక్కలు నాటండి

అవినీతి మద్యం
బరి తెగించాయి
బెల్టుషాపుల్ని కంటున్నాయి

బుడ్డోడు ముందు
సంచిడు పుస్తకాలు
ఆట పారిపోయింది

బర్రెల బారులు
కర్రతో బాలుడు
విద్యా హక్కు అవాక్కు

కోతల యంత్రం
పొలంలో దిగింది
పనిపాట పొట్టగొట్టింది

పాఠం చెబుతూ
చెయ్యి పట్టుకున్నాడు
టీచకుడు

- చల్లా విశ్వనాథం

నిర్వచనం

బ్రహ్మ దీవెన కన్నా
అమ్మ శాపం చల్లనిది
హిమశీతల హేమంతంలో
చలిమంట ఇచ్చే
వెచ్చదనం లాంటిది
అమ్మ క్రోధాగ్ని
ఆమె శాపంలో కూడా
ఒక వరమే
దాగి ఉంటుంది
ఆమె ఆవేశంలో
ఒక ఆరాటం
అణిగి ఉంటుంది
ఆమె ఆక్రోశంలో
ఒక అనురాగం
పొదిగి ఉంటుంది
సృష్టిలోని ప్రేమ ప్రవాహానికి
జీవనది అమ్మ!
అమ్మ ప్రేమకు
ఆకాశం కూడా
హద్దుగా నిలబడలేదు
అమ్మకు నిర్వచనం
అనంతం!

- సోమిశెట్టి వేణుగోపాల్

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

K.V.R. B.Com.,B.L., (Director)

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.



స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

కూపన్ పంపండి లేదా SMS పంపండి.

CHENNAI: 0-97890 99589

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం., పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్సు ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్సు, రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్సు మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

ఎవరి గోల వారిదే

పడక గదులు పాడుబెట్టిన అంబానీ



దాదాపు నాలుగువేల కోట్ల రూపాయలతో ముఖేష్ అంబానీ ముంబైలో నిర్మించిన 'ఆంటిలియా' 27 అంతస్తుల నివాస భవనానికి వాస్తు దోషం ఉందా? చోద్యంగాకపోతే ఎంత డబ్బుంటే మాత్రం ఇంత మిడిమేలపు ఇల్లు కట్టుకుంటారా అని నిర్మాణ సమయంలో ఎందరో ఆక్షేపించినా పూచికపుల్లమాదిరి తీసివేసిన వారు వాస్తు దోషం ఉందనే నమ్మకంతో దానిలో చేరకుండా ఏడాది కాలంగా పడకగదులను 'పాడు' పెట్టి ఉంచారట. పార్టీల వంటివి జరుపుకుంటారు, పగలంతా అక్కడే ఉంటారటగాని రాత్రి 'నిదురపోయేందుకు' మాత్రం పాత ఇంటికే వెళతారట. ఇందిరమ్మ ఇల్లును నమ్ముకొని ఉన్న గుడిసెను కూల్చివేసి కొత్త ఇల్లు రాక, వచ్చినా పూర్తిగాక 'గుడిసెపోయి డేరాలోకి' వచ్చిన వారిని రాష్ట్రంలో ఎందరినో చూశాము. కానీ ప్రపంచ ధనికుల్లో ఒకడైన ముఖేష్‌కు ఇలాంటి ఇళ్ల కట్టించటం వాటిని పాడుబెట్టటం ఒక లెక్కలోనిదిగా కనిపించటం లేదు. నిర్మాణ సమయంలోనే వాస్తుదోషాలను సరిచేస్తూ తగు జాగ్రత్తలు తీసుకున్నారట. అయినా 'ఎక్కడో' లోపం జరిగిందని,అది 'కుటుంబ ఆరోగ్యానికి' హాని కలిగిస్తుందని తెలుసుకున్నారట. న్యూయార్క్‌లోని మాన్‌డ్రెయిన్ ఓరియంటల్ హోటల్ మాదిరి ముఖేష్ సతీమణి నీతా అంబానీ ఈ ఇంటిని డిజైన్ చేయించారట. ఎవరూ చేరరాని దీవిలోని ఒంటి స్థంభపు మేడ అనే అర్థం వచ్చే విధంగా పేరు పెట్టుకున్న ఈ ఇంటిలో ఒకేసారి మూడు హెలికాప్టర్లు దిగటానికి వీలుగా మూడు హెలిపాడ్లు, ఒక సినిమా థియేటర్, పార్టీ, నృత్య గానా బజానాకు అవసరమైన ఏర్పాట్లు, కాన్ఫరెన్సు హాళ్లు, తేలియాడే పార్కులు, వచ్చినవారి కార్లకు పార్కింగ్ కోసం ఆరు అంతస్తులు ఈ ఇంట్లో ఉన్నాయి. ఇంతకూ దోషం కట్టిన ఇంట్లో ఉందా? అంత సొమ్ము సంపాదించిన లావాదేవీల్లో ఉందా? చమురు, సహజవాయువు వెలికితీత, ఇతర లావాదేవీల్లో అక్రమాలకు పాల్పడిన అంబానీ కంపెనీ ఇప్పుడు విచారణలో ఉంది. బహుశా ఇదే వారిని భయపెట్టి ఉండాలి.

దొంగ పిల్లులు- తిక్కరేగిన సిఇఓ

ఒక కంపెనీ 'సిఇఓ'కు చూసి చూసి ఒళ్లు మండింది. ఆఫీసులోని ఫ్రిజ్‌లోంచి పాలు తాగి తెలియనట్లు ఉండే 'దొంగ పిల్లుల'ను ఉద్యోగం నుంచి తొలగిస్తానని చిర్రుబుర్రులాడుతూ సిబ్బందికి ఇ మెయిల్ పంపాడు. అమెరికా న్యూ జెర్సీ నగరంలో బెకర్‌మాన్ అనే ప్రకటనలు రూపొందించే కంపెనీ ఉంది. అరవై మంది సిబ్బంది అక్కడ పని చేస్తారు. దాని యజమాని కెయిత్ జెకేమ్. ఏ ఉద్యోగి అయినా పాలు తాగితే తాగండి, తిరిగి పాలతో ఫ్రిజ్ నింపండి లేదా, పొద్దున్నే నేను వచ్చినపుడు ఎవరైనా పాలు తాగుతూ కనిపించారో వారిని ఉద్యోగం నుంచి పీకిపారేస్తాను, ఎన్నిసార్లు చెప్పినా మీ బుద్ధి మార్చుకోవటం లేదు. దీన్ని జోక్‌గా తీసుకోవద్దు. నన్ను పరీక్షించటానికి ప్రయత్నించవద్దు. నిజానికి పాలు తాగటం పెద్ద సమస్య కాదు. పాలు తాగిన వారు తిరిగి తెచ్చి పెట్టటం తోటి ఉద్యోగుల పట్ల గౌరవం చూపినదానికి చిహ్నం. నేను ఈ రోజు ఉదయం పాలకోసం ఫ్రిజ్‌లో చూస్తే మూడు చుక్కల పాలు కనిపించాయి. మూడంటే మూడు చుక్కలు. అవి చాలు ఎలుక పిల్లలు పెరగటానికి. ఈ పనిచేసింది బద్ధకిస్టు అయి ఉండాలి. పాలంటే పడి చచ్చే ఈ సిఇఓగారి కోపానికి కారణం ఇదన్న మాట. లాభం తగ్గిపోతుందని గాకపోతే సిబ్బంది అందరికీ ప్రతి రోజూ తలొక డబ్బా పాలు తెచ్చి ఇస్తే అసలు ఈ సమస్యే తలెత్తి ఉండేది కాదుగా. పిసినిగొట్టుగాక పోతే ఒక డబ్బా పాలు ఫ్రిజ్‌లో పెట్టటం ఎందుకు, ఎవరైనా తాగి మరొక డబ్బాను తెచ్చి పెట్టమని అడగటం ఎందుకు? టైమిస్తే బయటకే వెళ్లి తాగి వచ్చే వాళ్లం కదా అంటారా ఆఫీసు సిబ్బంది? ఏమో?

అమెరికా సొమ్ము బాగ్దాద్ గజదొంగల పాలు

ఒకటి కాదు రెండు కాదు, 4000 కోట్ల డాలర్లు, రెండులక్షల కోట్ల రూపాయలు. ఇరాక్‌ను ఆక్రమించిన అమెరికా 2003-08 మధ్య ఖర్చులు చెల్లించేందుకు పంపిన సొమ్ము ఏమైందో తెలియదట. పోయిన సొమ్ము ఎలాగూ వచ్చేది లేదు, చెప్పుకుంటే సిగ్గుచేటు విచారణ లేదు ఏమీలేదు ఇంకేం మాట్లాడకండి అని అమెరికా రక్షణ శాఖ అంటోందట. ప్రపంచ చరిత్రలో ఇంత మొత్తం సొమ్మును విమానాల్లో తరలించటం ఒక రికార్డట. అమెరికా నుంచి పక్కా రక్షణతో కట్టలు కట్టి ప్రత్యేక మిలిటరీ విమానాల్లో ఎవరికీ తెలియకుండా జాగ్రత్తగా బాగ్దాద్ పంపారు. ఇరాక్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన తరువాత బిల్లుల చెల్లింపు ఆగిపోయిందని, 28.1 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి బరువు 363 టన్నులకు చేరిందని, తక్షణమే డబ్బు కావాలంటే అమెరికన్లు ఒక లెక్క ప్రకారం నాలుగువేల కోట్ల డాలర్లు పంపారు. డబ్బు పంపటం తప్ప అది మంగళగిరి పానకాల స్వామి పానకం తాగినట్లుగా ఎక్కడకు పోయిందో తెలియదు. ఎవరికి చెల్లించారో లేదో కూడా తేలటం లేదట. అమెరికా పార్లమెంటరీ కార్యాలయం విచారణ పేరుతో మరికొన్ని టన్నుల పేపర్లపై నమోదు చేసిన సాక్ష్యాలను చూసి కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ప్రతి విమానం నుంచి డబ్బు కట్టలను స్వీకరించింది సౌదీ అరేబియాలో జన్మించి అనేక అరబిక్ భాషలను మాట్లాడగలిగిన బాసెల్ అనే ఒకే వ్యక్తి అని, అతగాడు అమెరికా నుంచి సాధారణ వ్యక్తిగా వచ్చి సద్దాం హుస్సేన్ భవనంలో సందర్శకులు వేచి ఉండే దగ్గర ఉండేవాడని, అనువాదకుడిగా పని చేశాడని గుర్తించారు. రాత్రుళ్లు వచ్చిన కరెన్సీ కట్టలను ఎక్కడ పెట్టాలో అమెరికన్లు చెప్పిన అంశాలు ఇరాకీ డ్రైవర్లకు అర్థం అయ్యేవి కావట. అప్పుడు బాసెల్‌ను ఉపయోగించుకున్నారు. అతగాడికి ఇలాంటి విషయాల్లో అనుభవం లేకపోయినా నగదును తరలించిన తీరుతెన్నులను చూసి అమెరికన్లు పూర్తిగా నమ్మారు. బాగ్దాద్ చెత్తను తరలించే ట్రక్కులను తీసుకొని లోపల డబ్బు కట్టలు, పైన చెత్త వేసి సురక్షితంగా రవాణా చేయించేవాడు. ఒకసారి ఉపయోగించిన ట్రక్కును మరోసారి వినియోగించేవాడు కాదట. ఎలాంటి సమస్యలు లేకుండా చేర్చిన డ్రైవర్లకు వెయ్యి డాలర్ల వంతున ఇచ్చేవాడు. బాసల్ అక్రమాలకు పాల్పడలేదని తేలటంతో తమ అధికారులే అక్రమాలకు పాల్పడి ఉంటారని అమెరికా సర్కార్ భావిస్తోంది. ఇరాక్ అనుభవంతో బేసెల్ లిబియాలో కూడా అమెరికా డబ్బును అధికారులకు చేరవేసే కాంట్రాక్టును పొందాలని బేసెల్ ప్రయత్నిస్తున్నాడు.

- ఎం. కోటేశ్వరరావు

మీ ఇంట్లోనే పవర్‌ఫుల్ స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్

ఇంగ్లీష్ కోర్స్ రూ.600/- లకే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1
డివిజన్-2
డివిజన్-3
\+ అడిషనల్ బుక్స్, ఒక డైరీ, ఒక ఆడియో సి.డి. మరియు కోర్స్‌కు ఉపయోగపడే 4 ఇన్ 1 గిఫ్ట్ బుక్స్ (పోకెట్ సైజులో)
ఇవన్నీ రూ.600/-లు

డివిజన్-1 Basic నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది.

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది.

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.

పూర్తి డబ్బు వాపస్ మనస్ఫూర్తిగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే, కోర్సు పుస్తకాలు 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. డైరీ సైజు 12 cm X 17.5 cm లోనూ (ఆఫ్‌సెట్ మల్టీకలర్ కవర్‌తో) ఉంటాయి. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ సంవత్సరానికి క్రొత్త డైరీగా ఉపయోగించుకునే విధంగా ప్రత్యేకంగా రూపొందించబడిన డైరీ.

కొత్త సంవత్సర కానుక



కూపన్ పంపండి లేదా SMS పంపండి.

Phone: 0-99405 70931

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పేరు, ఇంటి నెం. ఊరిపేరు, పిన్‌కోడ్, ఫోన్ నెం.లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. పై ఫోన్ నెంబరు 24 గంటలూ కంప్యూటర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. మీరు పంపే ఎస్.ఎమ్.ఎస్. అడ్రసు ఫోన్ నుండి కంప్యూటర్‌కు వెళ్తుంది. మీ అడ్రసు ప్రకారం మేము కోర్సు మెటీరియల్ పంపుతాము. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

STUDENTS' ENGLISH INSTITUTE

Post Bag No. 8569,
No. 17/A, Chari Street, T. Nagar, Chennai - 600 017.

నాకు కోర్సు మెటీరియల్ పంపండి. పోస్ట్‌మేన్‌కి మొత్తం రూ.600/-లు చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

కొన్ని లక్షలాదిమంది విద్యార్థులచేత పూర్తిగా అంగీకరించబడిన అద్భుతమయిన కోర్స్

కథ

ఓ వెంకటేష్ కథ

- అవనిగడ్డ వనజ

ఇంటర్మీడియట్ రిజల్ట్స్‌ను ఉన్నత విద్యాశాఖా మంత్రి ఉదయం 11.30 గంటలకు విడుదల చేశారు. అంతే ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా విలేకరులు ఒకటే ఉరుకులు పరుగులు. ఎక్స్‌క్లూజివ్ స్టోరీ ఇవ్వడానికి పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. గతంలో తెల్లారితే పత్రికలో నెంబర్ చూసుకుని పాసయ్యామో లేదో తెలుసుకునేవాళ్లం. ఇప్పుడు ఫలితాలు విడుదల చేసిన అరగంటలోపలే నెట్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. ఎక్కువ మంది రిపోర్టర్లు కార్పొరేట్ కళాశాలలు పెట్టే ప్రెస్‌మీట్లకు బయలుదేరారు.

ఎలక్ట్రానిక్ ఛానల్ 'ప్రజాపక్షం' రిపోర్టర్ రవి రిజల్ట్ చూసిందే తడవుగా బండి తీసి రయ్‌మంటూ పోనిచ్చాడు. బండి వేగానికి ఎర్రటి దుమ్ము లేస్తోంది. అదేం లెక్కచేయకుండా స్పీడుగా పోనిస్తూ ఓ గుడిసె ముందు బండి ఆపాడు. లోపల 40 ఏళ్ల వ్యక్తి ఉన్నాడు.

"ఇంట్లో ఎవరూ లేరా!" అనడిగాడు.

"ఆ, ఎవరూ పిలిచేది..." అంటూ మత్తుగా గొంతు వినిపించింది.

"నేను మీడియా నుండి వచ్చాను. మీ అబ్బాయి వెంకటేష్ ఉన్నాడా?"

"ఎవరూ, యెంకటేశా, ఇపుడే జీవాలు తోలుకుని పొలాల్లోకి వెళ్లాడు. అట్టా పోతే మిట్టపైనుండి కనిపిస్తాడు సూడు. మా అబ్బాయితో ఏం పని?" అనేలోపే రవి బండి స్టార్ట్ చేసి మిట్టవైపు పోనిచ్చాడు.

దూరంగా తలకు కండువా చుట్టుకుని, చేతిలో కర్రతో జీవాలను అదిలిస్తూ వెంకటేష్ కనిపించాడు. మిట్ట పైవరకూ బండిపై స్పీడుగా వచ్చినా, జీవాల వద్దకు పోవాలంటే బండి దిగాల్సిందేనని అర్థమయ్యింది రవికి. దిగి నడవడం ప్రారంభించాడు. ఫలితాలు కళ్ల ముందు ప్రత్యక్షమయ్యాయి. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి మండలంలోని తండా నివాసి అయిన వెంకటేష్‌కు జిల్లాలోనే అత్యధిక మార్కులు వచ్చాయని జడ్పీ ప్రధానోపాధ్యాయులు ఫోన్ చేశారు. తనకు బాగా తెలిసిన వ్యక్తి కావడంతో ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన సమాచారం మేరకు ఆ పల్లెకు వచ్చాడు. అయితే వెంకటేష్ జీవన స్థితిగతులు దగ్గరకొస్తేగాని అర్థం కాలేదు. పరీక్షా ఫలితాలు వస్తాయని తెలిసి కూడా గొర్రెలు మేపడానికి వెళ్లక తప్పని పరిస్థితి. అతనితో మాట్లాడితే తనకు తప్పకుండా ఎక్స్‌క్లూజివ్ స్టోరీ వస్తుందని తెలుసు. అంతే మరింత ఉత్సాహంగా అడుగులు ముందుకేసి వెంకటేష్‌ను చేరుకున్నాడు. తనను వెతుక్కుంటూ వచ్చిన వ్యక్తి తన రిజల్ట్ వివరాలు చెప్పడంతో వెంకటేష్ మొహంలో ఆనందం వెల్లివిరిసింది. మైక్ వెంకటేష్ ఎదురుగా పెట్టి ఇక రిపోర్టర్‌గా ప్రశ్నల వర్షం కురిపించాడు రవి.

"ఇంటర్ తరువాత ఏంచేయాలనుకుంటున్నావు?"

"డిగ్రీలో చేరతాను.."

"అదేంటి. అందరిలా సాఫ్ట్‌వేర్ ఇంజనీరునవుతా, డాక్టరవుతా, ఐఏటికి వెళతా అని ఏదో చెబుతావనుకుంటే ఇంత సింపుల్‌గా చెప్పావేంటి?"

"ఔను సార్. నేను డిగ్రీలోనే చేరతాను"

"ఏమి? మీ నాన్న చదివించలేరా?"

"అదేం లేదు సార్. నాకు వచ్చిన మార్కులకు ఏ కార్పొరేట్ కళాశాల వారైనా తప్పకుండా ఉచితంగానే చదువు చెబుతామని ముందుకొస్తారు. అంతేకాదు, పేదరికంతో ఉన్నాను, చదువుకోవాలని ఉంది? అని అడిగితే ఎవరైనా చేరదీసి చదివిస్తారు. కానీ ఏ ఇంజనీరో, డాక్టరో అయితే ఈ సమాజాన్ని మార్చలేను కదా, కేవలం కొంతమందికి మాత్రమే సేవ చేయగలను...."

"సమాజ సేవా? అంటే ఏం చేస్తావు?"

"రాజకీయాల్లోకి వస్తాను...."

బిత్తరపోవడం రవి వంతయ్యింది. ఇంతవరకూ రాజకీయాలను ప్రొఫెషన్‌గా తీసుకుంటాను అని ఏ విద్యార్థీ చెప్పగా వినలేదు.

"రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ఎప్పటినుంచి?"

"నా చుట్టూ వున్న వారిని అర్థంచేసుకోవడం మొదలెట్టినప్పటి నుంచి సార్..

మీరు ఇక్కడకు వచ్చే ముందు మా ఇంటికెళ్లుంటారు కదా. కుక్కి మంచంలో పడుకుని ఉంటాడు మా అయ్య.. చిన్నప్పటి నుంచి పేదరికంలోనే ఉన్నాం. తింటానికి ఒక్కో రోజు తిండి కూడా ఉండేది కాదు. ఎన్నో రాత్రులు మా అమ్మ నీళ్లతోనే కడుపు నింపుకుని మా పొట్ట నింపడానికి చూసేది. పస్తులతో ఉండడం ఆమెకు అలవాటై పోయింది. అమ్మ అనే ఆకారమే తప్ప డొక్కలు ఎండిపోయి ఉండేవి. మా పేదరికాన్ని గమనిస్తున్న ఒకామె తరచూ మా ఇంటికి వచ్చి వెళుతూ ఉండేది. మా అమ్మకు సానుభూతి మాటలు చెప్పేది. డబ్బుంటే పిల్లల్ని చదివించుకోవచ్చని, మంచిగా బతకొచ్చని ఊహల్లోకి తీసుకెళ్లేది. తనతో పాటు ఢిల్లీకి వస్తే మంచి ఉద్యోగం ఇప్పిస్తానని, ఓ ఇంట్లో ఉండి పనిచేస్తే చాలని నమ్మబలికింది. అవసరం వారిది కాబట్టి వేలాది రూపాయలు జీతం ఇస్తారని నచ్చజెప్పింది. ఆరు నెలలు కళ్లు మూసుకుంటే బిడ్డల భవిష్యత్ బాగుంటుందని భరోసా ఇచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో అంతకంటే గత్యంతరం

లేక మా నాయనకు చెప్పి ఆమెతో బయల్దేరింది. వెళ్లే ముందు మమ్మల్ని దగ్గరకు తీసుకుని పొగిలి పొగిలి ఏడ్చింది. వదిలి వెళ్లలేక డొక్కలు ఎగిసిపడేలా ఏడుస్తూ మమ్మల్ని అక్కున చేర్చుకుంది. అప్పుడు నా వయస్సు పన్నెండేళ్లు. చెల్లాయికి తొమ్మిదేళ్లు.

వెళ్లిన తర్వాత ఒక సంవత్సరం వేర్వేరు అడ్రస్సులతో మా అమ్మ నుంచి డబ్బు వచ్చేది. ఆ తరువాత ఓ ఫోను లేదు, ఉత్తరమూ లేదు. కనీసం డబ్బులన్నా పంపిస్తుందేమోనని మా అయ్య ఆశ. ప్రతిరోజూ పోస్టుమాన్ వచ్చే సమయానికి కాసుకుని అడిగేవాడు. మూడేళ్ల పాటు అమ్మకోసం కళ్ల కాయలు కాచేలా ఎదురుచూశాం. తొమ్మిదేళ్ల చెల్లాయి పలకా బలపం పక్కన పెట్టి పొయ్యి వెలిగించడం ప్రారంభించింది. చుట్టుపక్కల వాళ్ల సాయంతో అన్నం ఉడకేసి పెట్టేది. ఉడికీ ఉడకని అన్నం, చింతతొక్కు, పచ్చళ్లతో మా జీవనం గడిచింది. ఎప్పటికైనా అమ్మ వస్తుందని, డబ్బులు తెస్తుందని, నన్ను బాగా చదివిస్తుందన్న ఆశతోనే బడికెళ్లేవాణ్ని. పాత పుస్తకాలను అడిగి తీసుకుని చదివేవాణ్ని. నోటు పుస్తకాలు కొనాలంటే ప్రాణం మీదకొచ్చేది. ఓ రకంగా వాళ్లనీ, వీళ్లనీ డబ్బులడుక్కుంటూనే ఇన్నాళ్లూ చదువుతూ వచ్చా. చెల్లాయి రెండు మూడిళ్లల్లో పాచిపని చేసి వాళ్లిచ్చిన అన్నం తెచ్చి పెట్టేది. మా అయ్య దొరికిన రోజు కూలికెళ్లేవాడు.

నేను పదో తరగతి చదువుతున్నప్పుడు ఓ రోజు మా ఇంటికి ఎవరో వచ్చారు. ముందు నేను గుర్తు పట్టలా. తీరా చూస్తే మా అమ్మ. ఎముకల గూడులా జీవచ్ఛవంలా ఉంది. ఇంటి చుట్టూ జనం గుమిగూడారు. వారి మాటలను బట్టి నాకర్థమయ్యింది. మా అమ్మకు ఏదో జబ్బు అంటుకుందని. అది తగ్గదని, త్వరలోనే చచ్చిపోతుందని. ఎవరూ మా ఇంటి ఛాయలకు వచ్చే వారు కాదు. చేతిలో డబ్బుల్లేని మేం అమ్మకు వైద్యం చేయించాలన్న ఆలోచన కూడా చేయలేకపోయాం. కనీసం పుష్టికరమైన ఆహారం అందించలేక పోయాం. మా ఇంటిని వెలేశారు. ఎవరూ ఇంటి దరిదాపులకూ వచ్చేవాళ్లు కాదు. అయ్యకు పని ఇచ్చేవారు కాదు. చెల్లి పనిచేసే వాళ్ల ఇళ్లల్లోనూ పనికొద్దని చెప్పేశారు. సమాజం నుంచి మా కుటుంబాన్ని వెలివేస్తే భరించలేకపోయాను. గుండెలవిసేలా అమ్మను పట్టుకుని ఏడవాలనిపించేది. అయితే ఎముకల గూడులా ఉన్న అమ్మను చూస్తుంటే భయమేసేది. నెలరోజులకే ఆమె మాకు శాశ్వతంగా దూరమయ్యింది. మా కోసం, మా భవిష్యత్ కోసం ఏజెంట్ మాటలు నమ్మి తన జీవితాన్ని నాశనం చేసుకుంది. ఢిల్లీలో వేశ్యావృత్తిలో ఇమడలేకపోయింది. బలహీనంగా ఉండడంతో వ్యాధి త్వరగానే అంటుకుంది. అంతే అక్కడివారు తిప్పి పంపించేశారు. అప్పుడప్పుడు మా అయ్య ఇదంతా తలచుకుని ఏడుస్తూ ఉండేవాడు. ఆ బాధతోనే తాగుడుకు బానిసయ్యాడు. ప్రస్తుతం తాగడమే ఆయన పని. అమ్మ చనిపోయినప్పుడు అధికారులు వచ్చి ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. మా ప్రజాప్రతినిధి వచ్చి ప్రభుత్వానికి తెలియజేసి లక్ష రూపాయలు ఇప్పిస్తామని చెప్పారు. రెండేళ్లయ్యింది. చిల్లగవ్వ ఇవ్వలేదు. అమ్మ చనిపోయినప్పుడు ఇచ్చిన ఐదువేల రూపాయలతోనే ఈ జీవాలు తీసుకున్నా. ప్రస్తుతం చెల్లాయి వీటిని మేపుతోంది. నేను సెలవులు ఇచ్చినప్పుడల్లా సాయం చేస్తుంటాను. మా భవిష్యత్ చూడాల్సిన అమ్మానాన్న ఇద్దరూ ఓ రకంగా మాకు దూరమయ్యారు. పేదరికాన్ని ఆసరా చేసుకుని అమ్మను వేశ్యావృత్తిలోకి దింపిన ఈ సమాజాన్ని మార్చాలని అప్పుడే నిర్ణయించుకున్నా. బాధల్లో ఉన్న అయ్యకు బెల్టుషాపుల ద్వారా దగ్గరైన ఈ తాగుడుపై తిరగబడాలన్నా రాజకీయాలు అవసరమే. ఇప్పుడు చెప్పండి నేను ఇంజనీర్నైనా, డాక్టర్నైనా ఈ సమాజాన్ని మార్చగలనా?.



మా చెల్లి చదువుకునే వయస్సులోనే కుటుంబ భారం మోస్తోంది. బాల్యంలో ఉండాల్సిన తీపిగురుతులేవీ ఆమెకి లేవు. వండి పెట్టడం, జీవాలు కాయడంతోనే సరిపోతుంది. పనిమంతురాలైన చెల్లాయిని చూసి పట్నంలో ఏదో ఒక ఇంట్లో పనికి పెడితే డబ్బులు ఇస్తారని చుట్టుపక్కలవారు సలహా ఇచ్చారు. చదువుకు ఇబ్బంది ఉండదని హితబోధ చేశారు. అయితే అమ్మకు జరిగింది చూశాక ఎవరి మాటా నమ్మదల్చుకోలేదు. డబ్బు లేకపోయినా పర్వాలేదు. చెల్లి మాత్రం కళ్లెదుటే ఉండాలనుకున్నా. చిన్నప్పటినుంచీ చెమటచుక్కతో తడిచిన చెల్లికి కష్టం అంటే తెలుసు. మనసున్న మనిషిగా ఎవరికి ఏ కష్టం వచ్చినా సాయం చేస్తుంది. వాళ్లిచ్చే రూపాయో, రెండు రూపాయలో కొంగుకు కట్టుకుని నా కోసం ఇంటికి తెస్తుంది. ఈ సమాజంలో నేను రుణపడేది ఎవరైనా ఉంటే చెల్లికే. తాను పస్తుండైనా నా కడుపు నింపేది. ఇంత చిన్న మెదడులో అంత పెద్ద ఆలోచనలు ఎలా వచ్చేవో అని ఒళ్లు గగుర్పొడిచేది. తన మంచి మనస్సే నా ఉన్నత చదువులకు పునాది. చెల్లిలాంటి వారు సమాజంలో కోకొల్లలు. తల్లీ దండ్రీ కూలికెళ్తుంటే, బిడ్డల్ని సాకుతూ ఆడపిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ప్రాథమికవిద్యను నిర్బంధం చేసినా, పరిస్థితుల్లో మార్పు రానంత కాలం మా లాంటి జీవితాలు ఇంతే. అందుకే పరిస్థితుల్లో మార్పు రావాలంటే ఆదర్శవంతమైన యువత రాజకీయాల్లోకి వస్తేనే సాధ్యం..." అంటూ కళ్లల్లో నీరు కారుతుంటే ఆవేశపూరితంగా తన దీనగాథను తెలియజేశాడు వెంకటేష్.

వెంకటేష్ కుటుంబ గాథ నా మనస్సును కదిలించింది. వెళ్లిన దారిలోనే తిరిగి ఆఫీసుకు బయల్దేరాను. నా మెదడులో ఆలోచనా తుట్టె కదిలింది.

రాజకీయాలు భ్రష్టుపట్టాయి. నల్లధనం లెక్కలేనంత మూలుగుతోంది.. రాజకీయాలంటే డబ్బు సంపాదనకే. పుత్తడి కుర్చీలలో కూర్చున్నవారు కటకటాలు లెక్కపెడుతున్నారు. రాజకీయాలలో అవధులు లేనంత అవినీతికి పాల్పడుతున్నారు. మరోవైపు పేదరికం పెరిగిపోతోంది. ఓ వైపు కుప్పలు తెప్పలుగా సంపద. మరోవైపు ఆకలికేకలు.

ప్రతిదీ వ్యాపారమయమైన నేపథ్యంలో వెంకటేష్ నిర్ణయం నాకు ముచ్చటేసింది. పేదరికంపై కసి పెరిగి ఏ అసాంఘిక కార్యకలాపాల వైపో, ఉగ్రవాదం వైపో వెళ్లకుండా వెంకటేష్ తీసుకున్న నిర్ణయం భావితరాలకు స్ఫూర్తి కాగలదనిపించింది. ప్రస్తుత అవినీతి రాజకీయాలను కడగడానికి ఓ ఆణిముత్యం రాబోతున్నాడంటూ వెంకటేష్ జీవన గాథను 'ప్రజాపక్షం' 30 మినిట్స్‌లో స్టోరీగా మలిచాను. ఆలోచించే ప్రతి ఒక్కరికీ ఈ కథ ఎక్స్‌క్లూజివ్. "డబ్బు సంపాదించాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్న ప్రజాప్రతినిధులకు వెంకటేష్ తప్పకుండా ప్రతిపక్షంగా నిలుస్తాడని ఆశిద్దాం" అంటూ ప్రజాపక్షం 30 మినిట్స్ స్టోరీ ముగుస్తుంది.

★



అటుకుల పాయసం

కావలసిన పదార్థాలు

అటుకులు - పావుకేజీ
పాలు - లీటరు
పంచదార - పావుకేజీ
జీడిపప్పు - 10
కిస్‌మిస్ - 10
నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు
యాలకుల పొడి - అర టీ స్పూను

తయారు చేసే విధానం

పాలు బాగా మరిగించాలి. అటుకులు నీళ్లలో కడిగి ఆరబెట్టాలి. కాగిన పాలల్లో యాలకుల పొడి, అటుకులు వేసి వెంటనే దించెయ్యాలి. లేకపోతే అటుకులు ముద్దవుతాయి. చివర్లో నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేస్తే అటుకుల పాయసం రెడీ.

అరటిపండు డ్రై బర్ఫీ



కావలసిన పదార్థాలు

మైదాపిండి - 1 కప్పు
అరటి పండ్ల గుజ్జు - 1 కప్పు
నెయ్యి - 1 కప్పు
వెన్న - 2 స్పూన్లు
పంచదార - పావుకిలో
యాలకుల పొడి - అరస్పూన్
బాదంపప్పు - 10
జీడిపప్పు - 10, కిస్‌మిస్ - 10

తయారు చేసే విధానం

ఒక స్పూను నేతిలో మైదాపిండి వేయించాలి. అందులో అరటిపండు గుజ్జు, వెన్న వేసి ముద్ద చెయ్యాలి. ఇందులోనే బాదం పప్పు, నేతిలో వేయించుకున్న జీడిపప్పు, కిస్‌మిస్, యాలకుల పొడి వేసి పూరీ పిండిలా కలుపుకోవాలి. దీన్ని చిన్న చిన్న బిళ్లల్లా కొంచెం మందంగా చేసుకుని నేతిలో ఎర్రగా వేయించాలి.

కాజు బొప్పాయి ముర్జీ

కావలసిన పదార్థాలు

బొబ్బాయి పండు - చిన్నది 1
పంచదార - 2 కప్పులు
నెయ్యి - 1 కప్పు
యాలకుల పొడి - అరస్పూను
జీడిపప్పు పలుకులు - 3 స్పూన్లు
బాదం పలుకులు - 3 స్పూన్లు
మైదా - అరకప్పు
చిక్కటి పాలు - 1 కప్పు
కిస్‌మిస్ - 10
పచ్చికొబ్బరి తురుము - పావుకప్పు

తయారు చేసే విధానం

బొప్పాయి ముక్కలను పేస్ట్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక స్పూను నేతిలో మైదాపిండి పచ్చి వాసన పోయేవరకు వేయించాలి. పంచదారలో ఒక కప్పు నీళ్లు పోసి తీగపాకం పట్టి, పాలు పోసి ఉడికించాలి. రెండు నిముషాల్లో పాలు విరిగిపోతాయి. ఆ మిశ్రమంలో వేయించిన మైదా, బొప్పాయి పేస్ట్, పచ్చ కొబ్బరి తురుము, జీడిపప్పు, బాదం పప్పు పలుకులు, కిస్‌మిస్, నెయ్యి వేసి కలపాలి. ఒక పళ్లానికి నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని పొయ్యాలి. అంతే కాజు బొప్పాయి ముర్జీ రెడీ. కావాలనుకుంటే దీన్ని ముక్కలు కోసుకోవచ్చు.

బ్రెడ్ మిఠాయి

కావలసిన పదార్థాలు

బ్రెడ్ ముక్కలు - 10, పాలు - అరలీటరు, క్రీమ్ - అరకప్పు
పంచదార - 1 కప్పు, నీళ్లు - అరకప్పు
కుంకుమపువ్వు - చిటికెడు, బాదంపప్పు - 10, నెయ్యి - అరకప్పు

తయారు చేసే విధానం

బ్రెడ్ ముక్కల అంచులు తీసి త్రికోణాకారంలో కోసుకోవాలి. వీటిని పెనం మీద నేతితో బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. పాలల్లో క్రీమ్ వేసి సగం అయ్యేవరకు మరిగించాలి. పంచదారలో కొద్దిగా నీళ్లు పోసి తీగపాకం పట్టుకోవాలి. ఈ పాకాన్ని క్రీం పాలల్లో కలపాలి. ఒక స్పూను పాలల్లో కుంకుమ పువ్వు వేసి కలిపి కాగిన పాల మిశ్రమంలో పొయ్యాలి. అందులోనే సన్నగా తరిగిన బాదం పలుకులు కలపాలి. వెడల్పు పాత్రలో వేయించిన బ్రెడ్ ముక్కలు పెట్టి పాల మిశ్రమాన్ని అందులో పోసి సన్న సెగమీద పాలన్నీ ఇంకిపోయేవరకు వుంచాలి. అంతే రుచికరమైన బ్రెడ్ మిఠాయి తయార్.



రవ్వ బొబ్బట్లు

కావలసిన పదార్థాలు

బొంబాయి రవ్వ - పావుకిలో
పంచదార - పావుకిలో
యాలకుల పొడి - 1 స్పూను
నీళ్లు - రెండు గ్లాసులు
మైదాపిండి - పావుకిలో
నెయ్యి - తగినంత, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

మైదాపిండిలో ఉప్పు వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. బొంబాయి రవ్వ వేయించి, పంచదార, నీళ్లు కలిపి సన్న సెగమీద ఉడకబెట్టాలి. ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. ఉడికిన తర్వాత అందులో యాలకుల పొడి కలిపి చిన్న చిన్న ఉండలు చేసి పెట్టుకోవాలి. ముందుగా కలిపి పెట్టుకున్న మైదాపిండిని చిన్న వుండలు చేసి పూరీల్లా వత్తుకోవాలి. వాటి మధ్యల్లో రవ్వ ఉండలను పెట్టి మూసెయ్యాలి. దీన్ని చపాతీలా వత్తుకుని నేతితో పెనం మీద కాల్చుకుంటే రుచికరమైన రవ్వ బొబ్బట్లు తయార్.



పక్షవాత రోగులకు కృత్రిమ హస్తాల కదలిక



డా॥ వింజమూరి రమణ

పక్షవాతం వచ్చిన వారికి కాళ్లూ చేతులు పడిపోవడం, ఇతరుల సహాయంతో తప్ప కదలలేక పోవడం తెలిసిన విషయమే. రకరకాల వైద్య విజ్ఞానాలు అందుబాటులోకి వచ్చినా ఇలాంటి వారి అవస్థలు ఇప్పటికీ తగ్గలేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డా॥ వింజమూరి రమణ చేసిన పరిశోధన ఇలాంటి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించే అవకాశం కలిగిస్తోంది. కంప్యూటర్ అనుసంధానం ద్వారా మెదడు సంకేతాలతోనే వారు కృత్రిమ హస్తాన్ని కదిలించే సామర్థ్యం ఈ పద్ధతి ద్వారా లభిస్తుంది. మామూలుగా మెదడు సంకేతాల ద్వారానే అవయవాలు పనిచేస్తాయి. వివిధ కండరాల కదలికలను స్వతంత్రంగా వెలువడే సంకేతాలతో సంధానం చేయడం ఇందులో అతి క్లిష్టమైన భాగం. ఇది ఒక క్రమ పద్ధతిలో జరిగితే కాళ్లూ చేతులు కదిలించడం సాధ్యమవుతుందని తన డాక్టరేట్ పరిశోధనానంతర పత్రంలో వింజమూరి రమణ నిరూపించారు. ఇవి పక్షపాతానికి గురైన రోగి మెదడులో ప్రేరణలు కలిగించి కృత్రిమ అవయవానికి సంకేతాలు అందేలా చేస్తాయి. ఇందుకుగాను ఆయనకు అమెరికాలోని శారీరక వైకల్య పరిశోధన సహాయ సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిసెబిలిటీ అండ్ రీహాబిలిటేషన్- ఎన్‌ఐడిఆర్‌ఆర్) 63,072 డాలర్లు బహుమానం ప్రకటించింది. యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్ ప్రచురించే యూనివర్సిటీ టైమ్స్ పత్రికలో ఈ పరిశోధన ఫలితాలు, రమణ అభిప్రాయాలు గతంలో ప్రకటించారు. అతని పరిశోధన విలువను, ప్రాధాన్యతను గుర్తించిన యూనివర్సిటీ వారు రమణను ప్రథమ ఇన్వెంటర్‌గా పేటెంట్ నమోదు చేశారు.

మెదడు కణజాలంలో అవయవాల కదలికలను నియంత్రించే సంకేత వ్యవస్థ సంజ్ఞలను గ్రహించడం ద్వారా సత్ఫలితాలు సాధించగలిగినట్టు రమణ వివరించారు. మామూలుగా చేతిని కదిలించిన రీతిలోనే పక్షవాతానికి గురైన చేతిని కూడా కదిలించేందుకు వీలుగా మెదడుకూ కంప్యూటర్‌కు మధ్య అనుసంధానం చేసే ఎలక్ట్రానిక్ పరికరాన్ని (ఇంటర్ ఫేస్)ను కనుగొనడమే ఈ పరిశోధన లక్ష్యం.

పై పరిశోధన కొనసాగింపుగా ఇటీవల అమెరికాలో పక్షవాత రోగులకు ప్రయోగాత్మకంగా ఇంటర్‌ఫేస్ అమర్చినప్పుడు వారు చేతిని బాగా కదిలించగలిగారు. ఉదాహరణకు ఏడేళ్ల కిందట మోటారు సైకిల్ ప్రమాదంలో చేయి చచ్చుపడిపోయిన టిమ్ హెమ్స్ అనే అతను ఈ పద్ధతిలో మెదడు సంజ్ఞల ద్వారా కృతిమ హస్తాన్ని పనిచేయించగలిగాడు. వింజమూరి రమణ పరిశోధన దీనికి ప్రాతిపదిక కాగా యూనివర్సిటీ పునరావాస వైద్య విభాగం అధిపతి డా॥మైకేల్ బోనింజర్ నాయకత్వం వహించారు. "ఇది అద్భుత పరిశోధన" అని డా॥బోనింజర్ హర్షం వ్యక్తం చేశారు. "ఈ విధంగా మానవ శరీరాలను పనిచేయించడం రాబోయే రోజుల్లో గొప్ప మార్పులకు నాంది అవుతుంది" అని ఆయన చెప్పారు. టైమ్స్ ఆఫ్ ఇండియా సైన్స్ పేజీలో 2011 అక్టోబరు 10 వ తేదీన ఈ ప్రయోగాత్మక చికిత్స గురించి ప్రముఖంగా రాసింది.

వింజమూరి రమణ 2008లో యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పూర్తి చేసుకుని అక్కడే స్కూల్ ఆఫ్ మెడిసిన్ రిసెర్చిలో అసోసియేట్‌గా తన బృహత్తర పరిశోధన కొనసాగిస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఐఇఇఇ) అనే ప్రముఖ సంస్థ ఆయన సాధించిన ఫలితాలకు గుర్తింపుగా పిట్స్‌బర్గ్ శాఖ సిగ్నల్ ప్రాసెసింగ్ సొసైటీకి చైర్మన్‌గా నియమించింది.

డా॥వింజమూరి రమణ తండ్రి డా॥విశ్వనాథమయ్య ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు రీడర్‌గా రిటైరయ్యారు. ఈ పరిశోధన విజయం పట్ల రమణ బంధుమిత్రులు విజ్ఞాన శాస్త్రాభిమానులు ఎంతో సంతోషం వెలిబుచ్చారు. ఇది భారతీయ విద్యార్థుల సాంకేతిక సామర్థ్యానికి మరో నిదర్శనమని వారు వ్యాఖ్యానించారు.

★

ఉరకలు వేసే జలపాతాలు



కెప్పజోగ జలపాతం

ప్రకృతి అందాలను ఇష్టపడేవారికి, సాహసాలంటే ఇష్టపడేవారికి, కొత్త ప్రదేశాలను చూడాలనకునేవారికి, జలపాతాల్ని, ఎత్తైన కొండల్ని సందర్శించాలనుకునే వారికీ కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా (నార్త్ కనరా) అనువైన ప్రాంతం.

వరి పొలాలు, కొబ్బరి తోటలు, యాలకులు, మిరియాల పంటలతో దట్టమైన తోపులు... ఎత్తయిన పర్వత శిఖరాల బారులు, ఉరకలు వేసే నదులూ ఇక్కడ కనిపిస్తాయి. అందమైన ఆలయాలూ, అచ్చెరువొందే జలపాతాలూ ఇక్కడే ఉన్నాయి. కర్ణాటకలోని విలక్షణమైన కొంకణ సంస్కృతీ ఈ జిల్లాల్లోనే కనిపిస్తుంది. ఇక్కడ పరవళ్లు తొక్కే జలపాతాలను చూసిన ఎవరికైనా ఆనందం కలగక మానదు. ఇవన్నీ యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తాయి.

కొండ శిఖరాన్నుండి లోయలోకి దూకే జలప్రవాహాలు కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాకు సందర్శకుల్ని ఆహ్వానిస్తాయి. అరేబియా సముద్ర తీర రేఖలో కార్వార్ ముఖ్య కేంద్రంగా విస్తరించిన ఉత్తర కన్నడ జిల్లా కేరళలోని అటవీ సౌందర్యాన్ని, గోవాలోని సాగర తీరాల అందాల్ని కలబోసుకుంది.

కెప్పజోగ జలపాతం

బెంగళూరుకు 470 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. ఇది అత్యంత సుందర ప్రదేశంగా పేరుపొందింది. శంకరతీర్థ, మంజుగుణి అనే రెండు ప్రవాహాలు ఉంచల్లి ప్రాంతం వద్ద కలిసి, లోతైన లోయలోకి దూకడం వల్ల ఈ జలపాతం ఏర్పడింది. ఉత్తర కన్నడ జిల్లాలోని సిద్ధాపూర్‌కు ఇది 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. సిద్ధాపూర్ నుండి హెగ్గరణె ప్రాంతానికి మోటారు వాహనాలకు అనువైన రోడ్డు ఉంది. అక్కడ దిగి మూడున్నర కిలోమీటర్లు నడిస్తే దట్టమైన అడవి మధ్య ఉరకలెత్తే ఉంచల్లి జలపాతం కనిపిస్తుంది. అడవిలో ఈ జలపాతం ఉనికిని 1845 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ జె.డి. లుషింగ్టన్ గుర్తించారు. అందుకే ఈ జలపాతాన్ని మొదట్లో ఆయన పేరుతోనే పిలిచేవారట. అయితే దీని హోరు చెవుల్ని చిల్లులు పెట్టేలా ఉండడంతో స్థానికులు దీన్ని కెప్పజోగ (బధిరత్వానికి గురిచేసే) జలపాతం అని కూడా వ్యవహరిస్తున్నారు. ఈ జలపాతం హోరు చాలా దూరం వినిపిస్తుంది. దీని పొడవు 116 మీటర్లు. దీన్నే 'అఘనాశని' అని కూడా అంటారు. పై నుండి కిందికి పడేటప్పుడు చిన్న చిన్న ధారలుగా ఉండి, మధ్యలో ఆ ధారలన్నీ ఏకమై హోరెత్తించే ధ్వనితో లోయలోకి విరుచుకుపడే దృశ్యం వర్ణనాతీతం. జలపాతానికి ఎదురుగా ఉన్న ట్రావెలర్స్ బంగ్లాలో నుండి ఈ జలపాత సౌందర్యాన్ని చూడ్డానికి పర్యాటకులు అమితంగా ఇష్టపడతారు. సూర్యకాంతి ఏటవాలుగా జాలువారే నీటి పాయల మీద పడి సప్తవర్ణాలను ఆవిష్కరిస్తుంది. ఆ దృశ్యం బహు సుందరంగా ఉంటుంది.

శివగంగ జలపాతం

ఉత్తర కన్నడలోని శిరిసికి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతానికి సరైన రోడ్డు కూడా లేదు. హులెకాల్ నుండి సంపిగడ్డె వరకు మట్టిరోడ్డుపై ప్రయాణించి అక్కణ్నుండి దట్టమైన అడవిలో కాలినడకన చేరుకోవాలి. సోండా అనే నది 74 మీటర్ల ఎత్తైన కొండ అంచు నుండి లోతైన అడవిలోకి ప్రవహించడం వల్ల ఈ జలపాతం ఏర్పడింది. ఈ ప్రవాహం సమీపంలోని బేడ్తి నదిలో కలుస్తుంది. ఇక్కడి పరిసరాలన్నీ పచ్చని తివాచీలా ఉంటాయి. దీనికి చేరువలో చిన్న దీవి కూడా ఉంది. గణేషుని ప్రతిమ ఉండడం వల్ల దీన్ని 'గణేష్‌పత్' అని పిలుస్తుంటారు.

తాలూకా కేంద్రమైన ఎల్లాపూర్‌కు చేరువలో, శిరిసికి యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న మగ్గోడు జలపాతం పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. బేడ్తి, శల్మలా నదులు కలిసి 180 మీటర్ల ఎత్తు నుండి ఇక్కడి లోయలోకి పరవళ్లు తొక్కడం వల్ల ఈ జలపాతం ఏర్పడింది. కర్ణాటక పర్యాటక శాఖ యాత్రికుల కోసం ఇక్కడో అతిథి గృహాన్ని కూడా నిర్మించింది.

సుసబ్బి జలపాతం

ప్రశాంతంగా ప్రవహించే నది ఒక్కసారిగా ప్రవాహ ఉధృతి పెరిగి లోతైన అగాథంలో పడితే ఎలా ఉంటుందో ఊహించండి. సరిగ్గా అలాగే ఉంటుంది సుసబ్బి జలపాతం. మైదాన ప్రాంతంలో నిదానంగా ప్రవహించే బిలిహొలె నది శిరిసికి ముప్ఫై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది కక్కిలి గ్రామం వద్ద కొండరాళ్ల మీదనుండి చెంగుమంటూ దూకే తీరు కన్నులపండుగే. దూరం నుండి ఈ జలపాతం మల్లెమొగ్గ ఆకారంలో కనిపిస్తుంది. శిరిసి నుండి వనల్లి చేరుకుని, అక్కడ్నుండి ఐదు కిలోమీటర్లు నడిస్తే ఈ అందాల జలపాతాన్ని చూడొచ్చు. వీటితోపాటు లాల్‌కులి, మలెమనె, శిర్లే జలపాతాలను కూడా చూడొచ్చు. ★



సుసబ్బి జలపాతం

ఒక్కొక్కళ్లకి ఒక్కో ఆనందం. ఏదో ఒక విషయాన్ని ఆలంబన చేసుకుని, అందుకు తగ్గట్టుగా అలౌకిక ఆనందం అనుభవించడం అందరికీ చేతకాదు. అందరూ కాకపోయినా చాలామంది మాత్రం కాస్త విశిష్టత ఉన్న తేదీలను, అంకెలను, సంఖ్యలను విచిత్రమైన లంకెలు కలిపి మరీ ఆపాదించుకుంటారు. అటువంటి 'ఆనందించదగ్గ' సందర్భం మరోటి వచ్చింది. అదే ఈ నవంబర్ పదకొండవ తేదీ.

'వన్‌డర్ డే!

పదకొండవ తేదీ, పదకొండవ నెల, పదకొండవ సంవత్సరం (దానికి రెండు వేలు కలపాలనుకోండి). రాస్తే అన్నీ ఒకట్లే. ఇదో ప్రత్యేకత అనుకుంటే, అదేరోజు సమయాన్నీ దీనికి కలిపి మరింత ఆనందం పొందుతుంటారు. పదకొండు గంటలు, పదకొండు నిముషాలు, అన్నే సెకన్లు... అయితే అదే రోజు అటువంటి ఒకట్ల సమయం రెండు సార్లు వస్తుంది. పగలు, రాత్రి. కానీ ఈ తేదీ మరో వందేళ్లకు కానీ రాదు.

ఇందులో విశేషం, ప్రత్యేకతా ఏముందని అనేవాళ్లూ, అనలేక అనుకునేవాళ్లూ చాలా మందే ఉన్నారు. తేదీలు, సమయాలు, కాలాలు, రుతువులు పునరావృతమౌతూనే ఉంటాయి. అంకెల్లో అదృష్ట, దురదృష్టాలను ఆపాదించుకుని ఆత్మానందం పొందేవాళ్లకి కొదవేమీ లేదు కదా! సోకాల్డ్ సంఖ్యా 'శాస్త్రజ్ఞులు' అచ్చంగా ఇటువంటి సందర్భాల కోసమే కాచుకుని ఉంటారు. వాళ్లకు తోచిన లెక్కలు కట్టి ఫలితాలనూ, ప్రభావాలను ప్రకటించేస్తారు. ఆల్రెడీ అటువంటి కార్యానికి పాల్పడ్డవారు అంతర్జాలం అంతటా సంచరిస్తూనే ఉన్నారు. నమ్మినవాళ్లకి నమ్మినంత. నమ్మనివాళ్లకి ఏమీ కానంత.

మనిషికి తాను కనిపెట్టిన వాటిపై మక్కువ ఎక్కువ. విచిత్రమేమిటంటే ప్రకృతిలో అనిర్వచనీయమైన అద్భుతాలను పట్టించుకోడు. కానీ, తన సృష్టికి సంబంధించిన విషయాలనే మహాద్భుతాలుగా లెక్కేసి, వాటి చుట్టూనే తన జీవితాన్ని అల్లుకుంటాడు. భాష – రాత మనం కనిపెట్టినదే. అంకెలూ మనవే. ఏడాదులూ, నెలలూ, సమయమూ అన్నీ మనమే తయారు చేసుకున్నాం. (ప్రకృతిలో చక్రీయ లక్షణం వల్ల ప్రతిదీ పదేపదే రావడం సహజం).

అయినా ఫలానా అక్షరంతో పేరుండాలనీ, ఫలానా పేరులో అక్షరాలు మార్చాలనీ, ఇంకొంతమంది 'నిపుణులు' అసలు పేరు సంతకం ఫలానాలా చేయాలని.. చేస్తే జీవితం సమూలంగా మారిపోతుందనీ ఉవాచిస్తారు, ఉపదేశిస్తారు. అన్నీ డబ్బు తీసుకునే సుమండీ! సరే పేర్లు గాబట్టి మార్పు చేసుకోవచ్చు. మరి పుట్టిన తేదీలు అటువంటి మార్పులకు లొంగవు కదా (చదువుకీ, పెళ్లికీ, పుట్టిన తేదీలు మార్చుకోవడమనే వెసులుబాటు ఉందనుకోండి). అందుచేత ప్రత్యేకమైన తేదీలు ఏమైనా ఎదురైతే, అటువంటి రోజుల్లో ప్రత్యేకమైన పనులు చేసుకుని తృప్తిపొందడం ఒక రకమైన ఆనవాయితీగా మారిపోయింది. ఈ శతాబ్దం పుట్టిన రోజే తమ పిల్లలు పుట్టాలని కొంతమంది తల్లిదండ్రులు 'సశాస్త్రీయంగా' ప్రయత్నాలు చేసి సాఫల్యత సాధించుకున్నారు. చాలామంది తమ పెళ్లి అదే రోజు చేసుకున్నారు. అదే రోజు చేసుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

ప్రస్తుతమూ అటువంటి సందడే ఉంది. 11.11.11 తేదీ మరో నూరేళ్లకు గానీ సాధ్యపడదు. కాబట్టి దాన్ని సద్వినియోగ పరుచుకుందామని ఉరకలేస్తున్నారు. "ఆ రోజు కారు కొందామని నిర్ణయించుకున్నాను. ఎన్నేళ్లైనా ఆ తేదీ గుర్తుండిపోతుంది కదా. అంతేగానీ ఆ రోజుల్లో ఏదో న్యూమరాజికల్ మ్యాజిక్ ఉందని కాదు" అని తన నిర్ణయం చెప్పాడు రెండు కార్లున్న వినయ్‌కుమార్. "వీలైతే ఆ రోజు కొన్న కారుకి నాలుగు ఒకట్లు నెంబరు వచ్చేలా ప్రయత్నిస్తా" అంటున్నాడు. కేవలం సరదాకి ఆ ప్రత్యేక రోజుని గుర్తుంచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు గానీ, చైనాలో చాలామంది ఆ రోజు తమ పెళ్లి చేసుకునే ఏర్పాట్లలో ఉన్నారు. ఒక్క చైనా ఏంటి? దాదాపు ప్రపంచమంతా వీలున్నవాళ్లందరూ అదే ప్రయత్నంలో ఉన్నారు. ఎవరికి తోచిన విధంగా వారు ఆ రోజుని ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా చేసుకుందామనుకుంటున్నారు. మన దేశంలో పెళ్లిళ్లు చాలా వరకు ముహూర్తబలం మీద జరుగుతాయి కాబట్టి ఇక్కడ ఆ రోజు పెళ్లి సందడి అంతగా ఉండదేమో! కానీ కాకతాళీయంగా ఆ రోజు శుక్రవారం కావడం వల్ల చాలా సినిమాలు విడుదలౌతున్నాయి. సినిమా పిచ్చోళ్లకు ఆరోజు సినిమా చూడాలన్న సరదా ఉంటుంది. అదే రోజు తమ పిల్లల్ని పుట్టించుకోవాలనే ప్రయత్నాలూ జరుగుతున్నాయని వినికిడి. వైద్యరంగం అభివృద్ధి ఈ విధంగానూ మానవాళికి సాయపడుతోందని సంతోషిద్దామా!?

ఇటువంటి సంఖ్యాక్రమాలు యాదృచ్ఛికం కాదు. మళ్లీమళ్లీ వస్తూనే ఉంటాయి. అయినా ప్రతిసారీ 'కొత్త'గా వచ్చే రోజుని ప్రత్యేకంగా ఉండేలా, ఏ పనీ చేయని వాళ్లు కూడా ఇటువంటి తేదీల కోసం హడావుడి చేస్తుంటారు. అదే విచిత్రం.

అయినా అంతే లెండి. అసలైన అద్భుతాలను చూడలేని మనకి ఇటువంటి దిక్కుమాలిన లెక్కలే అద్భుతాలు. సూర్యోదయాన్నీ, సూర్యాస్తమయాన్నీ చూడటానికి వీలూ లేదు (కనుచూపు మేర అపార్టుమెంట్లే), సమయమూ లేదు (యాంత్రిక జీవనం). వర్షపు చినుకు పడితే చాలు రాన్నీ రాలీ దాన్నుండి దాక్కునే ప్రయత్నం చేస్తాం. కనీసం ఎండని కూడ పూర్తిగా అనుభవించం. ఎప్పుడో వచ్చే గ్రహణాలని చూడకుండా జ్యోతిష్యుల బెదిరింపులకు బెదిరి ఇంట్లో నక్కుతాం. అసలు పుట్టడమనే అద్భుతాన్ని వదిలి పుట్టిన రోజు, టైముల్లో అర్థాలని వెదుక్కునే వాళ్లం. అనర్థాలని ఆలోచించి, జీవితాంతం ఆందోళనలో జీవించే వాళ్లం. మనకి అంకెలే అన్నీ. అంతేలెండి.

డా॥కాకర్లమూడి విజయ్

డిజిటల్ హల్‌చల్

మీడియా...

ఆకర్షణ, హోదా, సామాజిక స్పృహ, సద్భావన, సదవకాశాలు కలగలసిన రంగం. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగిందో, ఏం జరుగుతుందో, ఏం జరుగవచ్చునో... క్షణాల్లో కళ్లకు కట్టినట్లు చూపించేదీ, వివరించేదీ, విశ్లేషించేదీ, వివరణ ఇచ్చేదీ.. మీడియా. అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న సమాచార స్రవంతిగా, విడదీయలేని అనుబంధంగా ప్రజాజీవనంతో పెనవేసుకుపోయింది. రోజురోజుకూ పత్రికలకూ, ముఖ్యంగా ఛానళ్లకూ పెరుగుతున్న క్రేజ్ ఇందుకు చక్కటి ఉదాహరణ. పత్రికలతో పోలిస్తే టీవీల ప్రభావం... తక్షణంగానూ- ప్రత్యక్షంగానూ వుంటుంది. జరిగిన దాన్ని నివేదించేవి పత్రికలైతే.. జరుగుతున్నదాన్ని చూపించి, జరగబోయేదాన్ని నిర్దేశించగల శక్తి టీవీలకు ఎక్కువగా వుంటుంది. అదేసమయంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టాబ్‌లెట్లు విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మీడియాలో ముఖ్యంగా డిజిటల్ మీడియాలో వస్తున్న మార్పులు, తొక్కుతున్న కొత్త పుంతలు... ఈ వారం అట్టమీది కథలో...

- కె.ఎక్స్.రాజు

గత కొన్నేళ్ళుగా ఎలక్ట్రానిక్ మీడియా అతివేగంగా విస్తరిస్తోంది. గడచిన రెండు మూడేళ్ళలో అయితే ఇది ప్రింట్ మీడియాతో పోటీపడేస్థాయికి ఎదిగింది. ముఖ్యంగా తెలుగులో వార్తా చానెళ్ల ప్రాబల్యం విపరీతంగా పెరిగింది. జనజీవనంలో కంప్యూటర్ చొరబడని రంగాలు బహుకొద్ది మాత్రమే. మీడియా సైతం ఈ విషయంలో ముందంజలోనే వుంది. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ సౌకర్యం విస్తరించడం, ఉపగ్రహాల సహాయంతో 24గంటలూ టీవీ ప్రసారాలు కొనసాగుతున్నాయి. దీనివల్ల ప్రపంచంలో ఏ మూలన ఏ సంఘటన జరిగినా క్షణాల మీద ప్రపంచమంతా తెలిసిపోతోంది. యుద్ధ వార్తలను సైతం లైవ్‌లో చూస్తున్న రోజుల్లో మనమున్నాం. యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగిన సందర్భాల్లో ఆయా ప్రాంతాల నుండే వార్తలను, వీడియోలను పంపించడం ఇప్పుడు సాధ్యపడుతోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను మీడియా ఎప్పటికప్పుడు అనుసంధానం చేసుకొంటుండడమే దీనికి కారణం.

ఇటీవలి కాలంలో మీడియాలో ఇంటర్నెట్ వాడకం బాగా పెరిగింది. వెబ్ పత్రికలు, బ్లాగులు, సోషల్ నెట్‌వర్క్ సైట్లు, ఆన్‌లైన్ వీడియోలు... కూడా మీడియాలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వీటికి తోడు ఇప్పుడు మరో నూతన టెక్నాలజీ తోడైంది. అదే... మొబైల్ మీడియా, టాబ్లెట్ మీడియా. ఈమధ్య బాగా అభివృద్ధి చెందుతోన్న టెక్నాలజీ ఇది.

1998లో మొబైల్ ఫోన్ ద్వారా మీడియా కంటెంట్ అమ్మకం మొదటిసారిగా ప్రారంభమైంది. ఫిన్లాండ్‌లో రేడియో లింజాచే ద్వారా రింగ్ టోన్ల అమ్మకం జరిగింది. ఆ తర్వాత ఇతర మీడియా కంటెంట్ వార్తలు, వీడియో గేమ్స్, జోకులు, హోరోస్కోప్స్, టీవీ కంటెంట్, ప్రకటనల వంటివి కూడా ఆ జాబితాలో చేరాయి. ఇటీవల మొబైల్ ఫోన్ల కోసం ప్రత్యేక కంటెంట్ రూపొందిస్తున్నారు. ఇప్పుడు కొత్త టాబ్లెట్ పీసీల్లోనూ ఈ రకమైన అమ్మకాలు ప్రారంభమవుతున్నాయి.

మీడియాను మూడు భాగాలుగా చెప్పుకోవచ్చు. 1. ప్రింట్ మీడియా, 2. ఎలక్ట్రానిక్ మీడియా, 3. వెబ్ మీడియా. ఎలక్ట్రానిక్ మీడియాలో రేడియో, టీవీ, మొబైల్, టాబ్లెట్ పీసిలు ప్రముఖంగా వుండగా, వెబ్‌మీడియాలో వెబ్ పత్రికలు, బ్లాగ్స్, సోషల్‌నెట్‌వర్క్ సైట్లు వున్నాయి.

ప్రింట్ మీడియా

ఇది ఎవర్‌గ్రీన్. ఎందుకంటే సాంకేతికరంగంలో ఎన్ని మార్పులు వచ్చినా, 24గంటల వార్తా చానళ్లు, వెబ్‌సైట్లు, ఇ-పత్రికలు ఇలా... ఎన్ని వచ్చినా ప్రింట్‌మీడియా ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. పత్రికలు, పుస్తకాల పట్ల ఆదరణా తగ్గలేదు. ప్రింట్‌మీడియా కూడా ఎప్పటికప్పుడు వస్తున్న నూతన టెక్నాలజీని

అందిపుచ్చుకుంటూనేవుంది. వార్తల తయారీలోనూ, ప్రింటింగ్‌లోనూ, పత్రికను రీడర్‌కు అందించడంలోనూ నూతన పోకడలతో ముందుకు సాగుతోంది. 1655ఎ.డి.లో మొదటిసారిగా ఇంగ్లీష్‌లో 'లండన్ గెజెట్' అనే పత్రిక ప్రింటయ్యింది. ఇదే అతి పురాతనమైన వార్తాపత్రిక. 1702ఎ.డి.లో ఇంగ్లండ్‌లో మొదటి దినపత్రికను ఎలిజబెత్ మల్లెట్ ప్రారంభించారు. 1731ఎ.డి.లో ఎడ్వర్డ్ కేవ్ 'జంటిల్‌మన్' మ్యాగజైన్ ప్రారంభించారు. మొదటిసారిగా టైటిల్‌లో మ్యాగజైన్ పేరుతో వెలువడిన పత్రిక ఇదే. 1769ఎ.డి.లో మొదటి ప్రింటింగ్ ప్రెస్‌ను అమెరికాకు చెందిన క్రాఫ్ట్‌మెన్ ప్రారంభించారు. ఆ తర్వాత 1833లో 'న్యూయార్క్ సన్' పేరుతో సామాన్యులు సైతం చదివేలా అమెరికాలో తొలిపత్రిక వెలువడింది. 1836లో ఫ్రెంచ్ న్యూస్ పేపర్ 'లా ప్రెస్సె' మొదటిసారిగా డబ్బు చెల్లించిన ప్రకటనలను పొందుపరచింది. 1863లో థామస్‌నాస్ట్ అనే ఇలస్ట్రేటర్ హర్పర్స్ వీక్లీలో ఫొటోలను పరిచయం చేశాడు. 1952లో ద వండర్‌ఫుల్ వరల్డ్ ఆఫ్ ఇన్‌సెక్ట్స్ ఎలక్ట్రానిక్ సహాయంతో ప్రింటింగ్ ప్లాంట్‌పై తొలిసారిగా ముద్రించబడింది. ఫొటోటైప్ ప్రాసెస్‌లో వాణిజ్యపరంగా రూపొందిన మొదటి పుస్తకం ఇది. 1961లో మొదటి జిరాక్స్ మెషీన్‌ను పరిచయం చేశారు. 1980లో ఇంటర్నెట్ ప్రారంభమైంది. 1999నుండి ఇంటర్నెట్‌లో పబ్లిషింగ్ తదితర విషయాలకు సంబంధించిన విశేషలను, అనుసరించే పద్ధతులను తెలియజేయడం ప్రారంభమైంది. నేడు అత్యంత అధునాతన పరికరాలు, యంత్రాలు ప్రింట్ మీడియాలో భాగస్వామ్యమయ్యాయి.

ఈ డిజిటల్ యుగంలో ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటివి పత్రికా రచనలో శక్తిమంతమైన ఉపకరణాలు. వాటిని కూడా సమాచార సేకరణలో, కూర్పులో ఉపయోగించుకోవాలి. అవి వాడని మీడియా ప్రతినిధులు వెనకబడిపోతారని పత్రికారంగ ప్రముఖులు చెబుతున్నారు. డిజిటల్ మీడియా వేగవంతంగా జీవితంలోకి చొచ్చుకొని వస్తున్న ప్రస్తుత తరుణంలో పాఠకుల భాగస్వామ్యం పెంచుకునేలా జర్నలిజంను తీర్చిదిద్దాలనీ, పాఠకుల స్పందనను కోరడం ద్వారా వారిని కూడా భాగస్వామ్యం చేయాలనీ వారు చెబుతున్నారు. ప్రచురణకు ముందు దశలో కూడా పాఠకులను సైతం వార్తా సేకరణలో, వార్తల నిర్ధారణలో భాగం చేయాల్సిన అవసరం ఉంది. వార్తలను తెలియజెప్పే అధికారం, నైపుణ్యం, ఆసక్తి పాత్రికేయులకు ఒక్కరికే సొంతమని అనుకోవద్దని కూడా నిపుణులు చెబుతున్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా

ఇదో నిరంతర సమాచార స్రవంతి. ప్రపంచవ్యాపితంగా ఎక్కడ ఏం జరుగుతున్నా క్షణాల్లో కళ్లకు కట్టినట్లు చూపే ప్రసార సాధనం. వినోదాన్నీ, విజ్ఞానాన్నీ పంచుతున్న ఎలక్ట్రానిక్ మీడియాలో రేడియో, టీవీ, మొబైల్ ఫోన్లు, టాబ్లెట్ పీసీలు కూడా భాగమయ్యాయి. ప్రతిరోజూ అన్ని వేళల్లోనూ ఇవి ఏదోఒక సరికొత్త సమాచారంతో మనల్ని అలరిస్తూనే ఉంటాయి. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర ఎంతో కీలకమైంది. ఇప్పటికే రేడియో, టీవీ, న్యూస్‌ఛానళ్లు విశ్వవ్యాప్తంగా విస్తరించాయి. ప్రజల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రస్తుతం వ్యాపారం కూడా పెద్దఎత్తున సాగుతుంది.

రేడియో.. టీవీ ఆవిష్కరణ

1887-88 ప్రాంతంలో హెర్ట్జ్ అనే శాస్త్రజ్ఞుడు విద్యుదయస్కాంతాల ద్వారా కాంతిని ప్రసారం చేయవచ్చన్న మాక్స్‌వెల్ సిద్ధాంతాన్ని నిర్ధారించారు. ఆ తరంగాలను ఆయన రేడియేషన్ అని వ్యవహరించారు. 1906లో జర్మనీలో జరిగిన ఒక శాస్త్రజ్ఞుల సభ రేడియేషన్ నుండి రేడియో అనే పదాన్ని సృష్టించి అధికారికంగా వాడుకలోకి తెచ్చింది. తొలుత ఈ రేడియో సౌకర్యం నెలల తరబడి సముద్రంలో ప్రయాణించే నౌకలకు బాగా ఉపయోగపడింది. 1920లో క్రిస్టల్ రేడియోలు తయారు కావడం, 1954లో ట్రాన్సిస్టర్లు వాడుకలోకి రావడం జనసామాన్యానికి రేడియోను అందుబాటులోకి తెచ్చిన రెండు ముఖ్య పరిణామాలు. మన దేశంలో రేడియో ప్రసారాలకు 1923-24 సం॥లోనే అంకురార్పణ జరిగింది. 1927లో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ అనే ప్రైవేట్ సంస్థ బొంబాయి, కలకత్తా నగరాల్లో రేడియో స్టేషన్లను నెలకొల్పిన తర్వాతే ఒక పద్ధతి ప్రకారం ప్రసారాలు జరిగాయి. ఆ తర్వాత 1936లో ప్రభుత్వం ఢిల్లీలో రేడియో స్టేషన్ నెలకొల్పింది. అప్పటి నుంచే మనదేశంలో క్రమంగా రేడియో స్టేషన్లు ఏర్పడుతూ వచ్చాయి. 20వ శతాబ్ది చివరి దశకంలో టీవీ విస్తరించి రేడియో ప్రాబల్యాన్ని ఒకింత వెనక్కి నెట్టింది. ఐనా రేడియో ఉపయోగం తగ్గలేదు. టీవీ కార్యక్రమాలు మొదట 1959లో ఢిల్లీలో ప్రారంభమైయ్యాయి. 1982లో శాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ ఎక్స్‌పెరిమెంట్ (ఎస్ఐటిఇ) ప్రయోగాత్మకంగా విద్యావ్యాప్తి కార్యక్రమాలు ప్రారంభమైన తర్వాత టీవీరంగం వేగంగా వ్యాప్తి చెందుతూ వచ్చింది. ఈ క్రమంలోనే మనదేశంలో డజన్ల కొద్దీ టీవీ చానళ్ళు ప్రారంభమయ్యాయి. కేబుల్ టీవీ పల్లెపల్లెకు విస్తరించింది.

మొబైల్ ఫోన్.. టాబ్లెట్ పీసీ

ఇది నూతన జనసమూహ మీడియా. 1998లో మొదటిసారి మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయగలిగిన సమాచారం ఫిన్లాండ్‌లో ప్రారంభమైంది. కొంతకాలానికే మొబైల్ ప్రకటనలు అనుసరించాయి, ఇది కూడా మొదట 2000లో ఫిన్లాండ్‌లోనే ప్రవేశపెట్టబడినది. 2007నాటికి మొబైల్ ప్రకటనల విలువ వి2.2 బిల్లియన్లకు చేరింది. ప్రస్తుతం బిల్లియన్ల కొద్దీ ప్రకటనలు విడుదలవుతున్నాయి. చాలా నూతన మొబైల్ ప్రకటనలలో బ్యానర్ యాడ్స్, కూపన్స్, మల్టీమీడియా మెసేజింగ్ సర్వీస్ పిక్చర్ ఇంకా వీడియో మెసేజస్, అడ్వెర్ గేమ్స్, ఇతర మార్కెట్ ప్రచారాలు ఉన్నాయి. అంతేకాకుండా మీడియాలో వచ్చే వార్తలు మొబైల్ ఫోన్ల ద్వారా కూడా ప్రచారం జరుగుతోంది. ఏదైనా ఒక వార్తను ఎవరైనా పంపితే, మరొకరు దానికి కొనసాగింపుగా మరికొన్ని వివరాలను చేర్చి తిరిగి పంపడం వంటివి ప్రస్తుత మీడియాలో కొనసాగుతున్న సరికొత్త ట్రెండ్స్. అంతేకాకుండా ఆండ్రాయిడ్ ఓఎస్ వంటివి అందుబాటులోకి రావడంతో కొత్తకొత్త అప్లికేషన్స్ వినియోగదారులు ఉపయోగిస్తున్నారు.

అదేవిధంగా ప్రస్తుతం కంప్యూటర్లలోని ఫీచర్లతో కంప్యూటర్‌కి తక్కువ, మొబైల్‌ఫోన్‌కి ఎక్కువ అనే విధంగా అందుబాటులోకి వచ్చిన మరో వినూత్న సాధనం టాబ్లెట్ పీసీ. టెలికాం రంగంలో సంచలనం సృష్టిస్తున్న నూతన ఆవిష్కరణ ట్యాబ్లెట్ పీసీ. చూడ్డానికి చిన్నగా ఉన్నా పర్సనల్ కంప్యూటర్‌లో ఉన్న ఫీచర్లన్నీ ఇందులో ఉంటాయి. ట్యాబ్లెట్ పీసీల్లో 3జీ మొబైల్ సర్వీసు కలిసి ఉండడంతో వినియోగదారులు వీటి పట్ల విపరీతంగా ఆకర్షితమవుతున్నారు. ముఖ్యంగా యువత, వ్యాపార రంగంలోనివారు వీటిపై మోజు పడుతున్నారు. సెల్‌ఫోన్‌లో జరుగుతున్న మాదిరిగానే బ్రౌజింగ్, రకరకాల వ్యాపారాలకు ఇది కేంద్రంగా మారుతోంది.

వెబ్‌మీడియా

మొదటి రెండిటితో పోల్చితే మనదేశంలో తెహల్కా డాట్‌కామ్, వికీలీక్స్ వంటివి ఒకటి రెండు మినహా వెబ్ మీడియాకు అంత ప్రాధాన్యత లభిస్తున్నట్లుగా లేదు. అంతమాత్రాన దీన్ని తక్కువ అంచనా వేయడానికిలేదు. ఉదాహరణకు ప్రపంచంలోని 10అగ్రశ్రేణి వార్తా వెబ్‌సైట్లలో 'ది గార్డియన్' ఒకటి. ఆ వెబ్‌సైట్‌కు 3కోట్లమంది పాఠకులన్నారట. ఇది వెబ్ మీడియా పట్ల

పెరుగుతున్న ఆదరణకు సంకేతంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. టెక్నాలజీ పరంగా చూసినప్పుడు వెబ్ మీడియా కొత్తపుంతలు తొక్కుతోంది. మొబైల్ ఫోన్లు, టాబ్లెట్ పీసీల్లోనూ వార్తలు అందుబాటులోకి వస్తున్నాయి. దీనంతటికీ ప్రధాన కారణం ఇంటర్నెట్. వెబ్‌మీడియాలో ఆవిష్కృతమవుతున్న నూతన పోకడలకు ఇదే కేంద్రం.

ఇంటర్నెట్

ఇది మానవ గతినే మార్చివేసి ప్రపంచ సరిహద్దులను కుదించివేసిన ఒక సాంకేతిక విప్లవం. ఇంటర్నెట్ ఆవిర్భావంలో ప్రపంచవ్యాప్తంగా సమాచార విప్లవం ఆవిష్కృతమైంది. గత పదేళ్లలో వెబ్ యూజర్ల సంఖ్య 40 కోట్ల నుంచి 200 కోట్లకు పెరగడమే దీనికి నిదర్శనం. కాగా, సెల్‌ఫోన్ వినియోగిస్తున్న వారి సంఖ్య విశ్వవ్యాప్తంగా 530 కోట్లకు పైగా వుంది. భవిష్యత్‌లో వీరే అత్యధిక వెబ్ యూజర్లు కానున్నారని ఒక అంచనా. 2020 నాటికి 500 నుంచి 600 కోట్ల పరికరాలు.. అంటే మొబైల్ ఫోన్లు, పీసీలు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్ పీసీలకు వెబ్ దగ్గర కానుంది. అక్షరాస్యతను సాధించడంలోనూ, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవడంలోనూ, గ్రామీణులకు బ్యాంకు సేవలు దగ్గరకు చేయడంలోనూ వెబ్ దోహదం చేయనుంది. ప్రభుత్వంతోపాటు సంస్థల వ్యాపార విధానంలో మార్పు, అలాగే ఇంటర్నెట్ వినియోగంపై గుర్తింపు, నమ్మకం కలిగిస్తే సామాన్యులూ వెబ్‌కు చేరువవుతారని నిపుణుల అభిప్రాయం.

ఇరవయ్యేళ్ల క్రితం 1991, ఆగస్టు 6న మొట్టమొదటి వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. వరల్డ్‌వైడ్ వెబ్‌ను కనుగొన్న టిమ్ బర్నర్స్ లీ తన ప్రాజెక్టు గురించి తొలి వెబ్ సైట్ ఎంఎ.ఎ3.శీతీస్త్ర లో వివరించాడు. ఈ వెబ్‌సైట్ ఇపుడు అఆటశీ.ఎవతీఆ.ఎస్త్రగా కనిపిస్తుంది. మొట్టమొదటి వెబ్‌సర్వర్ ఇదే. 1991లో అందుబాటులోకి వచ్చిన ఇంటర్నెట్‌కు 1969లోనే అంకురార్పణ జరిగింది. అమెరికా రక్షణ విభాగంలో మిలిటరీ పరిశోధనా కార్యాలయాలను, మిలిటరీ నిధులతో పరిశోధనలు జరుపుతున్న విశ్వవిద్యాలయాలను కలపడానికి ''ఆర్పానెట్‌ఞ (అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేషన్ నెట్‌వర్క్) అనే వ్యవస్థను ప్రారంభించారు. ఖుష్త్ర అనే ప్రదేశంలోని ఒక కంప్యూటర్‌ను, కాలిఫోర్నియాలోని మూడు కంప్యూటర్లను కలపడం ద్వారా ఏర్పడిన ఆ చిన్న నెట్‌వర్క్ వ్యవస్థే నేటి అధునాతన ఇంటర్నెట్‌కు మూలం.

1992లో డెల్ఫి అనే తొలి వాణిజ్య, వ్యాపారాత్మక ఇంటర్నెట్ సేవలు అమెరికాలో ఆరంభమయ్యాయి. 1995 మేనాటికి ఇంటర్నెట్-వ్యాపారపరమైన పరిమితులు- అపోహలూ- అన్నీ తొలగిపోయాయి. అమెరికాలో ఎఓఎల్, ప్రొడిజీ, కంప్యూసర్వ్ లాంటివన్నీ ఆన్‌లైన్‌లోకి వచ్చాయి.

ఇండియాలో 1994లో తొలిసారిగా ప్రభుత్వరంగ కార్యాలయాలకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాతే ఇతర ప్రయివేటు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటర్నెట్ వాడకం విస్తృతం కావడంతో వెబ్ డిజైనింగ్, డాట్‌కామ్‌లు-కొత్త వ్యాపార అవకాశాలను తెచ్చాయి. నేడు మొబైల్ ఇంటర్నెట్ తాజా పరిణామం. అమెరికాలో చిన్నపాటి వ్యాపారం సైతం ఇంటర్నెట్ ఆధారంగానే పనిచేస్తోంది. నేడు 71% స్మాల్ బిజినెస్‌లో ఇంటర్నెట్ తప్పనిసరి అయింది. విజ్ఞానం, వినోదం, వాణిజ్యం, వ్యాపారం- ఇలా అన్ని రంగాల్లో తనవంతు పాత్రను పోషిస్తోంది. వెబ్ మ్యూజిక్, వెబ్ టీవీ, వెబ్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ కామర్స్, వెబ్ మ్యాగజైన్స్, ఇ గవర్నెన్స్, టెలికాన్ఫరెన్సింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్, ఐపి ఫోన్, ఐపి విడియోఫోన్, వెబ్ చాటింగ్, మెసేజింగ్, వీడియో చాటింగ్, ఇ-షాపింగ్ సౌకర్యాలు, సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లు, బ్యాంకింగ్ పోర్టల్స్, ఇ-బుక్‌షాప్స్, ఆర్కీవ్‌లూ- ఇలా ఎన్నో విలక్షణ సౌకర్యాలొచ్చాయి.

2000నాటికి ప్రపంచంలో బ్రాడ్‌బ్యాండ్ సేవలు విస్తృతం కావడం, 2002నాటికి బ్లాగ్స్ అందుబాటులోకి రావడంతో ఇంటర్నెట్ వినియోగం మరింత పెరిగింది. వికీపీడియా లాంటి విజ్ఞాన సర్వస్వాలూ, యూట్యూబ్ వంటి ఉచిత వీడియో పోర్టల్స్ హిట్ అవడంతో, మన దేశంలో ఎన్నో టీవీ ఛానళ్లు ఇంటర్నెట్‌లో తమ కార్యక్రమాలను అందుబాటులోకి తెచ్చాయి. దాదాపు అన్ని తెలుగు న్యూస్ ఛానళ్లనూ నెట్‌లో చూడవచ్చు. అన్ని పత్రికలనూ నెట్‌లో చదువుకోవచ్చు.

సోషల్ నెట్‌వర్కింగ్, ఇ-మెయిల్, మొబైల్ ఇంటర్నెట్ వంటివి అందుబాటులోకి రావడంతో డిజిటల్ సమాచారం ఎన్నో రెట్లు పెరిగింది. ఈ



డిజిటల్ సమాచారాన్ని పుస్తక రూపంలో ముద్రించి, ఒక దానిపై ఒకటి పేర్చుకొంటూ పోతే భూమినుంచీ ప్లూటోదాకా సుమారు పది వరసల్లో పేర్చవచ్చంటున్నారు విశ్లేషకులు. వీటికితోడు విజ్ఞానం, వినోదం, వైద్యం వంటి రంగాల్లోని డేటాను సమాచారాన్నీ కూడా కలుపుకొంటే అయ్యే ఖర్చు దీనికన్నా రెండు రెట్లు పైమాటే నంటున్నారు. వర్చువల్ విశ్వవిద్యాలయాలు, ఇ-లెర్నింగ్ సెంటర్లు వస్తున్నాయంటే దీనికీ ఇంటర్నెట్టే ప్రాతిపదిక. ఇ-మెయిల్ నుంచి ఇ-గవర్నెన్స్ దాకా ఇంటర్నెట్ విస్తరించిందీ అంటే, మానవ జీవితాలపై దీని ప్రభావం ఏమేరకు పడిందనేది ఇట్టే తెలుస్తోంది. దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ ఆన్‌లైన్‌లో సేవలు అందుబాటులోకి వస్తున్నాయి:

సోషల్ మీడియా

సోషల్ మీడియా చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. వెబ్ 2.0 ఆవిష్కరణతో ఇంటర్నెట్, సామాజిక, వ్యాపార సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి, సమాచారాన్ని ఇతరులతో పంచుకోవడానికి, ఆన్‌లైన్‌లో వివిధ ప్రాజెక్టులపై సహకరించుకోవడానికి ఒక వేదికగా మారింది. సోషల్ మీడియా మార్కెటింగ్ కార్యక్రమాలు ఆకట్టుకునే అంశాలతో పాటు ఆన్‌లైన్ సంభాషణలను వృద్ధి చేసే ప్రయత్నాలపై దృష్టిని కేంద్రీకరించి పాఠకులను ప్రోత్సహిస్తాయి. తద్వారా ఏదైనా సందేశం లేదా వార్త ఒక వినియోగదారు నుండి మరో వినియోగదారుకు సులభంగా వ్యాప్తి చెందుతుంది. సోషల్ మీడియా మార్కెటింగ్‌కు సంబంధించినంత వరకు ప్రారంభదశలోనే ఉన్నప్పటికీ, అనేక సంస్థలు సోషల్ మీడియా వినియోగానికి ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించుకుంటున్నాయి.

ఏదైనా ఒక బ్రాండ్‌ను వినియోగదారుల మనస్సుల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా చేయడానికి కొన్ని సంస్థలు వారి మార్కెటింగ్ వ్యూహాల్లో భాగంగా సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. నేడు ఇదొక విస్తారమైన ప్రకటనా వేదిక. వివిధ సంస్థలు సోషల్ మీడియాలో పంచుకున్న ఆసక్తిని బట్టి ఇతరులతో సంభాషించవచ్చు. ఉదాహరణకు... ఫేస్‌బుక్ వారి వినియోగదారులను తమ అవసరాల



కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించుకుంది. ఫేస్‌బుక్ చట్టపరంగా వారి వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసే సమాచారానికి సంబంధించిన మొత్తం హక్కులు ఫేస్‌బుక్‌కే వుంటాయి. దీంతో ఆ సైట్‌లోని సమాచారం మొత్తాన్ని సమగ్రంగా సేకరించి ఫేస్‌బుక్‌లోని వినియోగదారుల కోసం ప్రకటనల రూపంలో ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. ఇది ప్రకటనా ప్రపంచంలో ప్రకంపనాలను సృష్టించింది. ఈ ప్రకటనలు రావడానికి ముందు, ఆన్‌లైన్ ప్రకటన అంటే పాపప్‌ల రూపంలో వుండేది. బ్రౌజింగ్ సమయంలో ఈ పాపప్‌లు విసుగు పుట్టించేవిగా పలువురు భావించేవారు. ఈ పాపప్‌ల బెడద లేకుండా వినియోగదారుడు ప్రకటనలను చూసేవిధంగా రూపకల్పన చేసింది. ఏదైనాఒక మ్యాట్రిమోనియల్ సంస్థ ఫేస్‌బుక్‌లో ప్రకటన ఇవ్వదల్చుకుంటే, వారు ఖచ్చితంగా ఎంగేజ్ అయినట్లు లేదా డేటింగ్ అని చెప్పే సందేశాన్ని ఉంచిన వ్యక్తులకు మాత్రమే వారు ప్రకటనలు కనిపించేలా చేశారు. దీని ప్రభావం ఇతర వినియోగదారులపై లేకపోవడంతో పలు సంస్థలు ప్రకటనలు ఇవ్వడానికి ముందుకొచ్చాయి. దీంతో పే-పర్-క్లిక్ విధానాన్ని ఫేస్‌బుక్ ఉపయోగించడం ప్రారంభించింది.

ఫేస్‌బుక్ అడ్వర్టయిజ్‌మెంట్ సంస్థలకు మాత్రమే కాకుండా వినియోగదారులకు కూడా లభించే విధంగా ఎంగేజ్‌మెంట్ యాడ్స్ ప్రకటనలను రూపొందించింది. ఇది ఫేస్‌బుక్ వినియోగదారులకు, సోషల్ మీడియాకు మూడు ప్రత్యేకమైన అనుభవాలను అందిస్తుంది. మొదటిది- వినియోగదారునకు ప్రకటన లేదా ఉత్పత్తి ఎందుకు నచ్చింది లేదా ఎందుకు నచ్చలేదు అనే విషయాన్ని చెప్పేందుకు వ్యాఖ్యలను జోడించవచ్చు. ఈ వ్యాఖ్యలను ఇతర ఫేస్‌బుక్ వినియోగదారులు, స్నేహితులు చూసే అవకాశం వుంది. తద్వారా సోషల్ నెట్‌వర్క్‌లోని వారంతా ఇది మంచిదా కాదా అనేది తెలుసుకోవడానికి దోహదపడుతుంది. రెండవది- ఆన్‌లైన్‌లో స్నేహితులకు చిన్న, ఉచిత ఇ-గిఫ్ట్‌లను అందించడం. ప్రస్తుతం ఇది మంచి ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం ప్రకటనదారులు వినియోగదారులు వారి స్నేహితులకు ఇవ్వడానికి ఉచిత ఇ-గిఫ్ట్‌లను రూపొందించవచ్చు. మూడు- వినియోగదారులు వారు ఇష్టపడే ఉత్పత్తులకు లేదా సంస్థలకు స్నేహితులుగా మారవచ్చు. ఇది వారు ఇష్టపడే సంస్థ యొక్క ఫేస్‌బుక్ పేజీకి వారిని లింక్ చేస్తుంది. ఇది ప్రపంచంలోని ఒకేరకమైన ఉత్పత్తులను ఇష్టపడే మొత్తం ప్రజలకు ఒక విస్తృత వేదికగా మారడమేగాక, యాపిల్ వంటి సంస్థలు వారి అసలైన వినియోగదారులను గుర్తించేందుకు అనుమతిస్తుంది.

యూట్యూబ్

ఇంటర్‌నెట్‌లో వీడియోలకి పర్యాయపదంగా... కేరాఫ్ అడ్రస్ అయిపోయింది యూట్యూబ్. యూట్యూబ్ అంటే యూత్‌కు వీడియో పండగన్నమాటే. మీడియాలోనూ దీని పాత్ర గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలో దీని పాత్ర అనిర్వచనీయం. మీడియాలో అవసరమైన రకరకాల సమాచారానికి ఇది వేదికగా నిలుస్తోంది. వివిధ రంగాలకు సంబంధించి ఎప్పుడెప్పుడో జరిగిన సంఘటనలపై ఫీచర్లు ఇస్తున్నారంటే యూట్యూబ్ వేదికగా లభ్యమయ్యే సమాచారమేనని చెప్పవచ్చు. వెబ్‌సైట్‌లో వీడియో పెట్టాలన్నా, బ్లాగ్‌లో లింక్ ఇవ్వాలన్నా ఏకైక మార్గం యూట్యూబ్. అంచెలు అంచెలుగా ఎదుగుతూ ప్రపంచ వ్యాప్తంగా కస్టమర్స్‌ని సంపాదించుకుంది. తన కార్యకలాపాలను మరింతగా పెంపొందించుకునేందుకు గాను ఇటీవలే సింగపూర్‌లో లోకల్ వెర్షన్ వెబ్‌సైట్‌కి శ్రీకారం చుట్టింది. ఈ వీడియో షేరింగ్ వెబ్‌సైట్ ద్వారా సింగపూర్ లోకల్ కంటెంట్‌తో పాటు, రీజినల్ పాప్ కల్చర్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా, సౌత్ ఈస్ట్ ఆసియా దేశం అయిన సింగపూర్ విశేషాలను ప్రపంచానికి తెలియజేయడం దీని ఉద్దేశంగా వుంది. ప్రపంచవ్యాప్తంగా ఏ మూల ఏ చిన్న సంఘటన జరిగినా క్షణాల్లో వీక్షించగలుగుతున్నాం. అదే సమయంలో ఆ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు యూట్యూబ్లోనూ దర్శనమిస్తున్నాయి. ఆ క్షణంలో చానళ్లలో చూడలేని వారు యూట్యూబ్లో చూడగలుగుతున్నారు. అంతేకాదు దీనికి సంబంధించిన లింకులను ఇమెయిల్, బ్లాగులు, సోషల్ నెట్వర్కింగ్ సైట్లలోనూ ఇవి దర్శనమిస్తున్నాయి. ఆన్‌లైన్ వ్యాపారానికి కూడా ఇది వేదికగా మారింది. వివిధ సంస్థలు తమ వ్యాపారాలకు సంబంధించిన ప్రకటనలను సైతం ఆ రకంగానూ ఇది పెద్ద ఆర్థిక వనరుగా మారింది. యూట్యూబ్‌కు 10వేల మంది అడ్వర్టయిజ్‌మెంట్ భాగస్వాములున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా యూట్యూబ్‌కు ఆసియా మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. గతనెలలో ఫిలిప్పైన్స్ లోకల్ వర్షన్ విడుదల చేసిన యూట్యూబ్, ఇప్పుడు సింగపూర్ లోకల్ వర్షన్‌ని విడుదల చేసింది. గతంలోనే ఇండియాలో యూట్యూబ్ తన వర్షన్‌ని విడుదల చేసింది.

యూ ట్యూబ్ అనేది ఆన్‌లైన్‌లో వీడియోలను పంచే వెబ్‌సైట్. మీ వీడియోలను గూగుల్ అకౌంట్ ద్వారా దీనిలోకి అప్‌లోడ్ చేయొచ్చు. ఇతరులతో పంచుకోవచ్చు. 2005లో ప్రారంభమైన ఈ సైట్ ఆరేళ్లలోనే ఇంటర్‌నెట్ వినియోగదారులందరికీ పరిచయమైంది. పేపాల్ వెబ్‌సైట్ మాజీ ఉద్యోగులు చడ్ హుర్లె, స్టీవ్ చెన్, జావేద్ కరీం కలిసి ఫిబ్రవరి 2005లో ఈ సైట్‌ని రూపొందించారు. దీనికి లభిస్తున్న ఆదరణని గమనించి నవంబర్ 1, 2006న గూగుల్ దీన్ని కొన్నది. ఇది అడోబ్ ఫ్లాష్ వీడియో ఆధారంగా పనిచేస్తుంది. యూట్యూబ్‌లో "మి ఎట్ ది జూ" వీడియోని మొదట అప్‌లోడ్ చేశారు. 2011, ఫిబ్రవరి లెక్కల ప్రకారం యూట్యూబ్‌కు 490 మిలియన్ల మంది వినియోగదారులున్నారు. ప్రతి నెలా 92 బిలియన్ల పేజ్ వ్యూస్ వున్నాయి. 18-54 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి మాత్రమే యూట్యూబ్ వీడియోలు చూసే అనుమతి వుంది.

సమాచార ప్రసారంలో వేగంగా ఆధునికతను తెచ్చిపెడుతున్న ఈ డిజిటల్ యుగంలో మీడియాలో కూడా ఆ ఆధునిక సాధనాలను ఉపకరణాలుగా చేసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. నిజానికి, 110 కోట్ల జనాభా దాటిన భారతదేశంలో ఇవాళ ఇంటర్నెట్ కేవలం 8కోట్ల మందికే అందుబాటులో ఉంది. అంటే సుమారు 7శాతం మందికి అన్న మాట. అదే చైనాలో అయితే, 40కోట్ల మందికి నెట్ అందుబాటులో ఉంది. అమెరికా, ఐరోపా, చైనా వంటి దేశాలతో పోల్చుకున్నప్పుడు నెట్ వినియోగం తక్కువగా ఉన్నందువల్ల భారత్‌లో ఇప్పటికిప్పుడు డిజిటల్ మీడియాతో ఇబ్బందులు లేవు. కానీ, మొబైల్, 3జి టెక్నాలజీ వినియోగం వేగంగా పెరుగుతున్న ప్రస్తుత దశలో మరి కొన్నేళ్లలోనే భారత్‌లో సైతం సమాచార సాధనాలకు, ముఖ్యంగా పత్రికలకు డిజిటల్ మీడియా పెనుసవాలుగా మారనుంది. అమెరికా, ఐరోపా లాంటి దేశాల్లో లాగా భారత్‌లోని పత్రికలు కూడా పెద్ద కుదుపునకు లోనైనా పెద్దగా ఆశ్చర్యపడాల్సిందేముండదు. అందుకు ఎంత సమయం పడుతున్నది చెప్పలేకపోవచ్చు కానీ, అక్కడి లాంటి సవాళ్ళే ఇక్కడా రావచ్చు.

సమాచార విస్ఫోటనం సాగుతున్న ఈ రోజుల్లో సమాచారం కోసం వార్తాపత్రికలొక్కటే సాధనం కాదు. బ్లాగులు, సోషల్ నెట్వర్క్ సైట్ల ప్రాధాన్యం పెరిగిన విషయాన్ని కూడా గుర్తించాలి. వీటి ప్రభావం ఎంత వుందంటే... గడచిన అయిదేళ్లలో బ్రిటన్‌లో నాణ్యమైన వార్తాపత్రికల మార్కెట్ సైతం పడిపోయింది. భారతీయ వార్తాపత్రికల పరిస్థితి ప్రస్తుతానికి బాగానే ఉన్నా, మొబైల్ టెక్నాలజీ, బ్రాడ్‌బ్యాండ్, 3జి సేవలను జనం వినియోగం అంతకంతకూ పెరుగుతున్న దృష్ట్యా డిజిటల్ మీడియా సవాళ్లకు ఇక్కడి పత్రికలు, జర్నలిస్టులు సిద్ధంగా వుండాలి. ★

చిన్న కథ

అంత్ర మహిమ

"నేను ఎప్పటికైనా లక్షాధికారినవుతానయ్యా!" అనేవాడు భూషణం చిన్నతనంలో తండ్రితో.

"ఏడిశావ్ కానీ, ముందు ఈ పూటకి తిండి విషయం చూడు. నేను దక్షిణ వీధికి వెళ్తాను. నువ్వు ఉత్తర వీధికి వెళ్లు. అడుక్కుతినే వాళ్లకి మొండితనం ఉండాలి. పో... పొమ్మని కసిరినా, తిట్టినా, చీదరించుకున్నా వదలకుండా జిడ్డులా వుంటేనే వాళ్లకి విసుగు పుట్టి బిచ్చం చేసేది. ఎలాగైనా చెయ్యి. ఈ పూటకి గ్రాసం తెస్తేనే కడుపు నిండేది. లేకపోతే పస్తే!" అనేవాడు గంజాయి దమ్ము పీలుస్తూ.

తండ్రీ కొడుకులు ఇద్దరూ దేవుడి పటాలు పళ్లేల్లో పెట్టుకుని వీధి వీధీ, ఇల్లిల్లూ తిరిగి యాచించుకునేవాళ్లు. దాంతోపాటు తండ్రి అంత్రాలు, తంత్రాలు కట్టి రూపాయి, రెండ్రూపాయలు సంపాదించేవాడు.

భూషణం కొంచెం పెద్దయ్యాక పల్లవి మార్చాడు.

"ఇవాళ భిక్షం ఎత్తుకునే వాళ్ల దగ్గర కూడా లక్షలు మూలుగుతున్నాయి. నేను కోటీశ్వరుణ్ణి అవుతా చూడు!" అనేవాడు.

"ముందు ఈ పూట బిచ్చం ఎత్తుకురారా!" అని వాళ్లయ్య మత్తులో చింతబరికె పట్టుకుని చిత్తుగా కొట్టేవాడు.

భూషణం పరమ సోమరి. చిన్న పని చేయడానికి కూడా ఒళ్లు వంగదు. అప్పుడప్పుడు అడుక్కుతిండానికే బద్ధకిస్తుంటాడు. సారాయి, గంజాయి మాత్రం వదిలిపెట్టడు.

కష్టపడేవాళ్లకి కష్టమే మిగులుతుంది కానీ, డబ్బేం మిగలదనే లోకరీతి గమనించాడు భూషణం. అలా కష్టం చేసేవాళ్లు తెలివి తక్కువ వాళ్లు అనే నిర్ధారణకి వచ్చాడు. తను ఆ తెలివితక్కువ వాళ్లలో చేరదలచుకోలేదు.

కష్టపడేవాళ్లకి కష్టమే మిగులుతుంది కానీ, డబ్బేం మిగలదనే లోకరీతి గమనించాడు భూషణం. అలా కష్టం చేసేవాళ్లు తెలివి తక్కువ వాళ్లు అనే నిర్ధారణకి వచ్చాడు. తను ఆ తెలివితక్కువ వాళ్లలో చేరదలచుకోలేదు.

వయసు పెరుగుతున్న కొద్దీ అడుక్కుతింటూనే తండ్రి నుండి వారసత్వంగా అంత్రాలు, తంత్రాలు, తాయెత్తులు కడుతూ వాటి గొప్పదనాన్ని వర్ణించేవాడు. మాయమాటలతో జనాన్ని బురిడీ కొట్టిస్తూ కాలం గడిపేవాడు.

అంత్రాలు, తాయెత్తుల మీద ఆదాయం కొద్దో గొప్పో వస్తుంది. కానీ తొందరగా కోట్లు సంపాదించాలనే కోరిక బాగా పెరిగిపోయింది. ఇందుకు దొంగతనానికి మించిన వృత్తి లేదని భావించాడు. అవసరానికి మించి ఎవరిదగ్గరైనా డబ్బుందంటే అది దొంగ సొత్తుకిందే లెక్క. తను దొంగతనం చేసినా తప్పేం లేదనుకున్నాడు.

ముందుగా చిల్లర దొంగతనాలు మొదలుపెట్టాడు. ఘరానా దొంగతనాలు బయటపడవు గానీ, చిల్లర దొంగతనాలు ఎంత కాలం దాక్కుంటాయి? మూడో రోజుకే దొరికాడు.

జనం ఫుట్‌బాల్ ఆడుకుని పోలీసులకి అప్పగించారు. వాళ్లు చిత్తుగా కొట్టి, చిప్ప కూడు తినిపించారు.

ఇది లాభం లేదని మకాం మార్చి స్వామి అవతారం ఎత్తాడు. జనం బాగానే వస్తున్నారు. రాబడి పెరిగింది. వ్యాపారం బాగా సాగుతున్న సమయంలో భక్తుల్లో ఒకామె చేయి పట్టుకున్నాడు. భక్తులు దైవ భజన మాని స్వామి వారికి చెక్క భజన చేశారు.

ఇవేవీ కలిసి రావడం లేదని మళ్లీ తండ్రికి వారసుడిగా తాయెత్తులు, అంత్రాలు, మంత్రాల వ్యాపారం మొదలెట్టాడు.

జనం వస్తున్నారు. వారి సమస్యల్ని బాగా ఆకళింపు చేసుకున్నాడు. వయసు దాటి పోతున్నా పెళ్లి కాని యువతులు, చదువు పూర్తైనా ఉద్యోగం రాని యువకులు, పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు, సొంతింటి కోసం తపిస్తున్న మధ్య తరగతి జీవులు, పెద్ద పెద్ద రోగాలతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని నిస్సహాయులైన రోగులు... ఇలా అందర్నీ గమనించాడు.

వీళ్ల సమస్యలకి మూలం ఒక్కటే... డబ్బు!

ఇలాంటి వాళ్లు దేశంలో వందకి తొంభై మంది వున్నారు. వీళ్ల సమస్యల్ని, అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరా చేసుకుని సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. మంత్రాలు, అంత్రాలు, తాయెత్తులే సమస్యల్ని పరిష్కరిస్తాయని ప్రచారం మొదలెట్టాడు. జనం క్యూ కట్టారు.

ప్రచారంతో పనికి రాని రాళ్లను కూడా రత్నాలని నమ్మించొచ్చు. పందిని నందిగా, నందిని పందిగా మార్చొచ్చు. పచ్చిదొంగని పరమ సాధువుగా, ఎంతో మంచివాడిని మోసగాడిగా చిత్రించొచ్చు. ప్రపంచమే ప్రచారంలో పీకల్లోతులో కూరుకుపోయింది. ప్రచారం మహిమని గమనించి ఇంకా పెంచాడు.

తాయెత్తులు కొద్దిగా డిజైన్ మార్చి అంత్రాలు, దాన్ని మార్చి యంత్రాలు, దేవుళ్ల ప్రతిమలు... అన్నీ అవే! రేకు బిళ్లలు, రేకు గొట్టాలు, రేకు బొమ్మలు...!

ఫలానా వూళ్లో తనిచ్చిన యంత్రం సహాయంతో ఫలానా యల్లమ్మకి పెళ్లయిందని, ఫలానా వూళ్లో ఫలానా మల్లయ్యకి తాయెత్తు కారణంగా అనుకోకుండా పూర్వీకుల ఆస్తి కలిసొచ్చిందని, మరో ఊళ్లో మరో ఆయనకి 50 లక్షల లాటరీ తగిలిందని, మరొకరికి ఉద్యోగం వచ్చిందని, ఇంకెక్కడో మరో అమ్మాయికి పెళ్లయిందని... ఇలా కల్లబొల్లి మాటలు చెప్పేవాడు. మొదట్లో పది రూపాయలకి ఇచ్చిన యంత్రం, జనం డిమాండ్‌తో ధర పెంచాడు. అలా పెంచి చివరికి ఒక్కో యంత్రం (అంత్రం) ఐదు వేలకు అమ్మడం ప్రారంభించాడు.

ధర పెరుగుతుందే కానీ డిమాండ్ తగ్గడం లేదు. పదివేలు చేసే యంత్రం ఐదువేలకే ఇస్తున్నానని, ఈ ఆఫర్ కొద్దిరోజులేనని మరో ప్రచారం మొదలెట్టాడు. భూషణానికి డబ్బే డబ్బు! డీడీల ద్వారా, క్రెడిట్ కార్డుల ద్వారా, పోస్టుల ద్వారా, వరదలా...డబ్బే... డబ్బు.... డబ్బుకి లెక్కే లేదు!

కొద్ది కాలంలోనే భూషణం తన కల నిజం చేసుకున్నాడు. నిజంగానే కుబేరుడయ్యాడు.

జనం మూఢనమ్మకాలే అతని పెట్టుబడి. వారి బలహీనతే అతని సంపాదనకు రహదారి.

- మొలకలపల్లి కోటేశ్వరరావు

మానవ విజ్ఞాన దీపిక

ప్రకృతితో మనిషికి విడదీయలేని సంబంధముంది. అది ప్రకృతిని చూసి మొదట భయపడినా, అదే ప్రకృతిని అర్థం చేసుకోగల్గినా, అర్థమైన దానిని తన జీవితంతో అనుసంధానం చేసుకున్నా, కొంతవరకు ప్రకృతిని జయించినా, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో. నేడు ఎంతో విలాసవంతమైన, సుఖమయమైన జీవితాన్ని సాగిస్తున్న నరుడే, ఒకనాటి వానరుడుగా అందరికీ సుపరిచితమే. కానీ అదే వానరుడు నరుడిగా అవతరించడానికి మధ్యలో గల పలు దశలు, పరిణామాలు, వాటిని ప్రేరేపించిన అంశాలు, పరిస్థితులు ఏమిటనేది తెలిసిన వారు బహు స్వల్పం. ఈ మానవ పరిణామాన్ని 'మానవ విజయం'గా మన ముందు ఆవిష్కరించిన యం.ఇలిన్, ఇ.సిగాల్ అభినందనీయులు. కడుపు నిండిన వాడికి ఆకలి బాధ తెలీదు. కానీ ఆ ఆకలి ఎలా ఉంటుందో తెలుసుకోవలసిన అవసరం లేకపోలేదు. అలాగే తినే తిండి నుంచి వాడే కంప్యూటర్ల వరకూ నేడున్నది రేపు కనిపించడం లేదు. ఇన్ని మార్పులకు, అభ్యుదయానికి కారణమైన చరిత్ర మాత్రం మౌనంగా చూస్తూనే ఉంటుంది. ఆ చెట్టు నుండి ఈ చెట్టు మీదికి దూకుతూ భూమిపై కాలు పెట్టాలంటేనే ఎటునుండి ఏ ఉపద్రవం వచ్చి పడుతుందో అని భయపడిన ఓ వానరం, నెమ్మదిగా భూమిపై నాలుగు కాళ్లతో నడిచి, క్రమంగా వెనుక కాళ్లపై మాత్రమే నడవడం నేర్చుకొని ముందు కాళ్లను చేతులుగా ఎలా ఉపయోగించుకున్నదో తెలిపిన తీరు ఔరా అనిపించక మానదు. ప్రకృతి తీరు అర్థంకాక మొదట భయపడిన ఈ మనిషే దాన్ని క్రమంగా జయించిన క్రమం గురించి నిశితంగా విశదపరిచిన వైనం ఒకింత ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగిస్తుంది. ఎందరో శాస్త్రవేత్తల జీవిత కాలాల కృషే ఈ పరిణామక్రమం. ఎక్కడెక్కడో తవ్వకాలలో బయటపడిన ఎముకలు, దంతాలు, పుర్రెలు, కాలిజాడలే ఆధారాలు మరి. ఈ పరిణామ క్రమంలో కేవలం మనిషే ఎందుకు మారాడు? అలా వేరే జంతువులు ఎందుకు మారలేదు? అభివృద్ధి చెందలేదు? అనే సందేహం సహజంగా మనందరికీ ఎప్పుడో ఒకప్పుడు రాక మానదు. మనిషి జంతువు నుంచి వచ్చినా, మనిషికి, జంతువుకి మధ్య భేదం విచక్షణ అని మాత్రమే మనకు తెలుసు. కానీ అంతకంటే తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. ఇలా అనేక విషయాలకు, సందేహాలకు సమూలమైన, సమగ్రమైన అవగాహన కానీ, సమాధానం కానీ కావాలంటే ఈ పుస్తకంలోని పుటలన్నీ తిరగేయాల్సిందే. మనిషి సాధించిన విజయాలు అంటే ప్రకృతిని జయించినా, తోటి జీవులపై ఆధిపత్యం సంపాదించగల్గినా అది సాధ్యమైనది కేవలం సంఘజీవనం వల్లే అనే సత్యం మనకు తేటతెల్లమౌతుంది. అడవిలో దొరికే గింజలు దాచుకునే క్రమంలో అవి కొన్ని కిందపడి మొక్కలు మొలవడం, తద్వారా గింజ నాటితే మొక్క మొలుస్తుందని, అలా మొలిపించిన మొక్కల నుంచి వచ్చే గింజలు అడవిలో దొరికే గింజల కంటే ఎక్కువ మొత్తంలో ఉంటాయని తెలుసుకున్నాడు. అంటే ఉత్పత్తి సాధనాలపై పట్టు సాధించాడు. అలా తనకెదురైన ప్రతి అనుభవాన్ని బట్టి తన మెదడుకు, ఆలోచనా శక్తికి పదును పెట్టాడు. చెకుముకి రాయి నుంచి నిప్పు వస్తుందని తెలుసుకున్నాడు. మూకుమ్మడి వేటలో సైగల ద్వారా సంభాషించాడు. తద్వారా మొదటి భాషను 'అభినయ భాష' గా వర్ణించిన తీరు శ్లాఘనీయం. అభినయ భాష వెలుతురు ఉంటేనే సాధ్యం కనుక ధ్వనుల ద్వారా సంభాషించాడు. అలా గుర్తుపెట్టుకునే సామర్థ్యం ఉన్నా, ప్రతిదీ సాధ్యం కాకపోవడంతో చిత్రాల ద్వారా చెట్ల బెరడుపై రాసి ముందు తరాలకు అందించాడు. ఇలా ప్రతి విషయాన్నీ కూలంకషంగా పుస్తకం చదువుతున్న వ్యక్తితో రచయిత సంభాషిస్తున్నాడా అన్నట్లుగా ఆద్యంతం ఎంతో ఉత్కంఠ రేకెత్తిస్తుంది. నేటికీ కొన్ని ఖండాల్లో రాతి యుగపు మనుషులు జీవిస్తున్నారంటే నమ్మగలమా? అంటే రాతియుగపు వాసనలు నవ మానవుణ్ణి ఇంకా వీడిపోలేదన్నమాట. 'నేను–నాది' అనే భావన ఏనాడు మొదలైందో ఆనాడే తెలియని, కనిపించని గోడలు ఏర్పడిన వైనం కనుల ముందే గోచరమౌతుంది. చివరికి దేవుడు స్వర్గంలో, పాతాళంలో ఉన్నాడనే మనిషి నమ్మకానికి బలం చేకూర్చిన అంశాలేంటో చదువుతుంటే 'నిజమే కదా' అని అనిపించక మానదు. డబ్బు సంపాదనే మానవ జీవిత పరమావధిగా మారి, చరిత్ర అంటే అదేదో ఒక పనికిరాని, జరిగిపోయిన కథ అని జనత, ముఖ్యంగా నేటి యువత భావిస్తున్న ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఈ మానవ విజయం, మా'నవ విజయా'నికి ప్రేరకంగా కనిపిస్తుంది. నేటి జీవన విధానంలో లొసుగులు, లోటుపాట్లు నాటి జీవన విధానం వేలెత్తి చూపుతుంది.

మానవ విజయం, యం.ఇలిన్, ఇ.సిగాల్, వెల : పేజీలు : 172,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి.కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 20.

- సింహాద్రి నాగశిరీష

అనువాద సమస్యల అధ్యయనం



అనువాద ప్రక్రియ విజ్ఞాన వికాసంలో కీలక పాత్ర పోషించింది. ప్రాచీన కాలంలో సంస్కృతంలోంచి ఆధునిక కాలంలో ఇంగ్లీషులోంచి అత్యధికంగా అనువాదాలు వచ్చాయి. వివిధ ప్రపంచ భారతీయ భాషల మధ్యనా ఇంగ్లీషు మాధ్యమం ద్వారా తెలుగులోకి వచ్చినవే ఎక్కువ. రచయితగా అనువాదకుడుగా అంతకు మించి విమర్శకుడుగా సుపరిచితుడైన రాచమల్లు రామచంద్రారెడ్డి 'అనువాద సమస్యలు' అనే పుస్తకం 'ఈ విషయమై మొదటి సమగ్ర గ్రంథం. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా లభించింది. ఈ పుస్తకం భాష నుడికారం, వ్యాకరణాల్లో తేడాలు, దేశాల వాతావరణ ప్రభావాలు వంటి అనేకానేక అంశాలను విశదీకరిస్తుంది. భాషలో లింగ భేదం, రుతువులు, ఆచారాలు, అలవాట్లు వంటివి ఎలా దేశ దేశాలకు భిన్నంగా వుంటాయో చెబుతుంది. ప్రాచీన పద సంపద ఎక్కువగా వున్న తెలుగుకూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎదిగిన ఇంగ్లీషుకు మధ్య మౌలికంగానే వున్న తేడాలను ఆయన బాగా చెప్పారు. ఉదాహరణకు సెక్స్, జెండర్ అన్న మాటలు ఇంగ్లీషులో విడిగా వాడితే తెలుగులో దానికి అనుగుణమైన పదాలు దొరకవు. గుడ్ మార్నింగ్, బ్రేకింగ్ ద ఐస్, కోల్డ్ షోల్డర్, వంటి మాటలు ఇంగ్లీషులో ఇచ్చే భావం వేరు, భారతీయ వాతావరణం వేరు. అలాగే సుదీర్ఘ వాక్యాలను యథాతథంగా అనువదిస్తే చదువరి జుట్టు పీక్కోవలసిందే. వాక్యంలో కర్త, కర్మ, క్రియ ఇంగ్లీషులో తెలుగులో భిన్నంగా వుంటాయి. అయితే రారా అనువాదం పరిధిని దాటి పోయి తెలుగు రచయితలు, సంపాదకుల భాషా ప్రయోగాలను చీల్చి చెండాడేందుకు ఎక్కువ శ్రమ పడ్డారు. తను చేసిన అనువాదాల ఉదాహరణలే ఎక్కువగా ఇవ్వడం కూడా సమంజసం కాకపోగా అందులో కొన్ని ఘోరంగా వున్నాయి.. ఇంగ్లీషు వ్యాకరణ సూత్రాలే శాశ్వతాలు కాదు, మారిపోతున్నాయి.. ఇంగ్లీషుకు గొప్పతనాలతో పాటు డొప్ప తనాలు కూడా వున్నాయి. కనక ఇతర దేశాల వారు వాడే ఇంగ్లీషును ఎగతాళి చేయడం తగని పని. ఏమైనా మూడవ ముద్రణ రావడం లోనే పుస్తకం ఉపయోగం తెలుస్తుంది.

అనువాద సమస్యలు, రాచమల్లు రామచంద్రారెడ్డి, వెల : 125/-, పేజీలు : 223,
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన్ భవన్, అబిడ్స్, హైదరాబాద్. మరియు అన్ని విశాలాంధ్ర బుక్ హౌసులు.

- తెర



ఆరోగ్య పరిరక్షణ, శారీరక పరిపోషణలలో విటమిన్ల పాత్ర ఎంతైనా ఉంది. పోషకాహారం లేక శుష్కించి పోతున్న వారికి విటమిన్లు తీసుకోమని వైద్యులు సలహా ఇస్తుంటారు. అయితే దేనికైనా పరిమితులు ఉంటాయి. శ్వాసక్రియకు స్వచ్ఛమైన గాలి అవసరమే కానీ ఉక్కిరిబిక్కిరి చేసే పెనుగాలిని మనం తట్టుకోలేం కదా? విటమిన్ల విషయంలో కూడా అంతే! అసలు ఈ విటమిన్ల ఉపయోగమేంటి? ఏ విటమిన్ ఎందుకు ఉపయోగపడుతుంది? అది ఏ యే ఆహార పదార్థాల్లో లభిస్తుంది. వంటి విశేషాలు మీకోసం...

విటమిన్ల విశేషాలు

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

ఆరోగ్యంతో అందంగా నిగనిగలాడుతూ, చురుగ్గా వ్యవహరించే శక్తి సామర్థ్యాలను సంపాదించాలని తహతహలాడని వారుండరు. అయితే ఏ నియమాలు, వ్యాయామాలు లేకుండా నాలుగు విటమిన్లు చప్పరిస్తే నరనరాల్లో ఆరోగ్యం నాట్యం చేస్తుందనుకోవడం చాలా పొరపాటు.

అదనపు విటమిన్ల కోసం ఔషధాలను ఆశ్రయించవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఔషధాలకు బదులుగా ప్రకృతి సిద్ధంగా లభించే కూరగాయలు, ఫలాలు ఆరగించి ఆరోగ్యాన్ని మూటకట్టుకొమ్మని హితవు చెబుతున్నారు.

అపోహలు

చాలామంది వైద్యునితో నిమిత్తం లేకుండా విటమిన్ టాబ్లెట్లను కొని నేరుగా వాడుతుంటారు. వీటిలో అధిక శక్తి ఉంటుందని, పురుషుల్లో ఇవి మగతనాన్ని పెంచుతాయని, జలుబు, రొంప, క్యాన్సర్, మస్తిష్క రోగాలు తగ్గుతాయని, వృద్ధాప్యం రాదని చాలామంది అపోహ.

నిజానికి అధికంగా విటమిన్లు తీసుకోవడం వల్ల లాభం ఏ మాత్రం ఉండదు. పైగా విటమిన్లు అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హాని అని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు.

విటమిన్లు 'బి1, బి2, బి6, సి' లను అధికంగా ఉపయోగిస్తే ఏ మాత్రం ఉపయోగం ఉండదని, విటమిన్ బి6 ను అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి, క్షమత, సామర్థ్యం పెరుగుతాయన్నది కేవలం అపోహ మాత్రమేనని ప్రయోగాల ద్వారా వైద్యపరిశోధకులు నిరూపించారు.

శరీరంలో జరిగే జీవరసాయన క్రియలకు విటమిన్లు సహాయకారులుగా ఉంటాయి. అలాగని వీటిని అధికంగా మాత్రల రూపంలో తీసుకుంటే నష్టాలు ఎక్కువగా ఉంటాయి.

తినే తిండిలో తగినన్ని విటమిన్లు లభించకపోతే ఔషధ రూపంలో వీటిని తీసుకోవచ్చు. ఉదాహరణకు ఉపవాసాలు చేసేవారు, ఆకలి వేసినా ఆహారం భుజించకుండా ద్రవ పదార్థాలతో కడుపు నింపుకునేవారు విటమిన్లు తీసుకోవచ్చు.

గర్భవతులు, పాలిచ్చే తల్లులు పౌష్టికాహారం తీసుకుంటుంటే ప్రత్యేకంగా విటమిన్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. విటమిన్లు ఉన్న మాత్రలు, కాప్స్యూల్స్, టానిక్ ఏదైనా సరే తీసుకునే ముందు ఎందుకు తీసుకుంటున్నాం? లాభం ఏంటి? అవసరమా? అని ఆలోచించుకోవాలి.

గర్భిణీలు 'విటమిన్ ఎ'ను ఏ కొద్దిగ ఎక్కువ మోతాదులో తీసుకున్నా గర్భస్థ శిశువుకు శారీరక లోపం ఏర్పడే ప్రమాదం ఉందని మరొక తాజా పరిశీలన.

లవణాలు, విటమిన్లను పెద్ద మోతాదులో తీసుకున్న వారిలో ఉదరకోశ వ్యాధులు, క్యాన్సర్, మానసిక సమస్యల వంటివి చోటుచేసుకుంటున్నట్లు మరొక పరిశోధనలో బయటపడింది. ముఖ్యంగా 'విటమిన్ సి, కాల్షియం, ఐరన్' వంటివి ఔషధాల రూపంలో తీసుకోవడం బాగా తగ్గించాలి.



ఏ విటమిన్ ఎందులో?

అసలు విటమిన్ల వల్ల ప్రయోజనం ఏంటి? అవి ఏఏ ఆహార పదార్థాల్లో సమృద్ధిగా దొరుకుతాయో తెలిస్తే ఔషధరూపంలో గాక ఆహారం రూపంలో వాటిని తీసుకోవడానికి వీలుంటుంది. అందుకే ఆ విశేషాలు తెలుసుకుందాం.

విటమిన్ ఎ

ఇది కంటి చూపు తగ్గకుండా, తల, చర్మానికి సంబంధించిన సమస్యలకు పరిష్కారంగా పనిచేస్తుంది. శారీరక పెరుగుదలకు తోడ్పడుతూ రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

ఆకుపచ్చని, పసుపు పచ్చని కాయగూరల్లో, పండ్లు, గుడ్లు, డైరీ ఉత్పత్తుల్లో ఇది లభిస్తుంది.

దీన్ని అనుదినం కనీసం 800 మైక్రోగ్రాములు తీసుకోవాలి.

బి విటమిన్లు

ఇవి ఎంజైముల ద్వారా కార్బోహైడ్రేట్ల నుండి శక్తి విడుదల చేయడానికి దోహదం చేస్తాయి. ప్రొటీన్లతో కణజాలానికి కొత్త జీవాన్నిస్తాయి.

విటమిన్ బి, ఒత్తిడిని తొలగించి రోగాలపై పోరాడే శక్తి సమకూరుస్తుంది. రక్తం ఉత్పత్తి పెరగడానికి సహకరిస్తుంది. పాలిష్ చెయ్యని బియ్యం, గుడ్డు పచ్చసొన, మాంసంలో లభిస్తుంది. రోజుకు 1.1

మిల్లీగ్రాములు శరీరానికి అవసరం.

విటమిన్ బి2 శరీరంలో ఎర్రరక్తకణాల ఉత్పత్తికి, దెబ్బతిన్న టిష్యూలు బాగు పడడానికి పనికి వస్తుంది. తృణధాన్యాలు, కోడిగుడ్లు, బచ్చలి, నట్స్, చేప, మాంసంలో లభిస్తుంది. రోజూ 1.3 మి.గ్రా॥ తీసుకోవడం మంచిది.

విటమిన్ బి3 నరాలు, మెదడు బాగా పని చేసేందుకు పనికి వస్తుంది. డిప్రెషన్‌ను దూరం చేస్తుంది. క్యాలీఫ్లవర్, బంగాళదుంప, గోధుమ ఉత్పత్తులు, క్యారట్, టమాటాలలో లభిస్తుంది. ప్రతి రోజు దీన్ని 15 మి.గ్రా॥ తీసుకోవచ్చు.

రక్తహీనతను నివారించడంలో, జీర్ణక్రియకు తోడ్పడడంలో విటమిన్ బి12 ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఆహారం శక్తిగా మార్పు చెందేటప్పుడు ఇది ముఖ్యభూమిక వహిస్తుంది. లివర్, బీఫ్, గుడ్లు, చేపలు, డైరీ ఉత్పత్తుల్లో ఎక్కువగా లభిస్తుంది. అనుదినం ఈ విటమిన్ 2 మైక్రోగ్రాములు అవసరం.

ఇన్‌ఫెక్షన్లు సోకకుండా శరీర నిరోధక శక్తిని విటమిన్ సి పెంపొందిస్తుంది. ఇది నీటిలో కరుగుతుంది. కాబట్టి మూత్రం ద్వారా ఎక్కువగా పోతుంది. అందుకే ఎప్పటికప్పుడు దీన్ని శరీరానికి అందించాలి. శరీరం ఐరన్‌ను గ్రహించడంలో తోడ్పడుతుంది. చెర్రీస్, కివి ఫ్రూట్స్, సిట్రస్ పండ్లు, ఆకుకూరలు, కాయగూరల్లో ఉంటుంది.



రోజుకు ఇది 500 నుండి 1000 మి.గ్రా॥ గ్రహణ శక్తిని పెంచుతుంది. దీనివల్ల ఎముకలు బలంగా ఉంటాయి. ఆర్థ్రైటీస్, క్యాన్సర్లు రాకుండా కాపాడుతుంది. పాలు, వెన్న, గుడ్లు, సూర్యరశ్మిలో ఇది అధికంగా ఉంటుంది.

విటమిన్ ఇ

'విటమిన్ ఇ' ని పునరుత్పత్తి శక్తి ప్రదాతగా అభివర్ణించడమే కాక దానికి 'టొకోఫెరాల్' అని పేరు పెట్టారు. అంటే శిశు జనన కారకం అని అర్థం. 'ఆయిల్ ఆఫ్ ఫెర్టిలిటీ' అంటారు. దీనివల్ల శరీర పటుత్వం బాగా ఉంటుంది. చర్మం ముడుతలు పడదు. క్రీడా సామర్థ్యం పెంచుతుంది. స్త్రీల జననాంగాల్లో తడి ఆరిపోకుండా కాపాడుతుందని ఇటీవల పరిశోధనల్లో తెలుసుకున్నారు.

వెజిటబుల్ ఆయిల్స్, గోధుమ, మొలకలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, బీన్స్ వంటి వాటిల్లో విటమిన్ ఇ ఉంటుంది. మనం తినే ఆహారంలో ఎక్కువగా ఇ విటమిన్ లభించదు. అందుకే చాలా మంది దీన్ని సప్లిమెంటుగా తీసుకుంటారు. అనుదినం దీన్ని 8 మి.గ్రా॥ తీసుకోవచ్చు.

'విటమిన్ కె' ఎముకల తయారీకి, ఆస్టియోపోరోసిస్ నివారణలోనూ పనిచేస్తుంది. లివర్, ఆకుకూరలు, లేత మాంసం, టమాటాలు, మొలకెత్తిన ధాన్యాలు, క్యాలీఫ్లవర్, క్యాబేజీ వంటి ఆహారంలో లభిస్తుంది. రోజుకు దీన్ని 60 మైక్రోగ్రాములు తీసుకోవచ్చు.

'విటమిన్ హెచ్' మనం భుజించిన కార్బోహైడ్రేట్లపై ప్రభావం చూపి ఫాటీ ఆమ్లాల తయారీలో పాలు పంచుకుంటుంది. శరీరంలో గ్లూకోజ్ నిల్వలను, కొలెస్ట్రాల్‌ను, నియంత్రించి చర్మం పొడిబారకుండా రక్షిస్తుంది.

లివర్, ఉడికించిన గుడ్లు... మొదలైన వాటిలో లభించే దీన్ని రోజుకు 25 మైక్రోగ్రాములు తీసుకోవాలి. విటమిన్ల వాడకం విషయంలో సొంతగా నిర్ణయాలు తీసుకోక వైద్యుల సలహా మేరకు వాడాలి. ★

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

సంక్రాంతి కథల పోటీ

సంక్రాంతి సందర్భంగా ప్రజాశక్తి సాహితీ సంస్థ కథల పోటీ నిర్వహించనుంది. రూ. 10,000 (ప్రథమ), రూ. 5,000 (ద్వితీయ), రూ. 3,000 (తృతీయ) పారితోషికం వుంటుంది.

కథలు చేరాల్సిన ఆఖరు తేది
డిసెంబర్ 15, 2011

<u>పాల్గొనే రచయితలకు సూచనలు :</u> ▶ కథలకు సమకాలీన పరిణామాలు, పరిస్థితులు నేపథ్యంగా ఉండాలి. ▶ ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ▶ ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకే ప్రాధాన్యం ఉంటుంది. ▶ మూఢనమ్మకాలను పెంచేదిగా కానీ, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా కానీ వుండకూడదు. ▶ మాండలికాలను ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధపడేలా వుండాలి. ▶ నవ్యత, వైవిధ్యం కలిగి ఇప్పటివరకు స్పృశించని కోణాలను ప్రతిబింబించే కథలకు ప్రత్యేక ఆహ్వానం.

<u>నిబంధనలు :</u> ◆ కథ నిడివి ప్రింటులో మూడు A4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 10 నుంచి 12 పేజీలు వుండాలి. ◆ ప్రింటయినా, చేతిరాతయినా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండాలి. ◆ రచయిత/రచయిత్రి పేరు కథపై ఉండకూడదు. ◆ పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఐడి వేరే కాగితం మీద రాసి జత చేయాలి. ◆ హామీపత్రం విధిగా జత చేయాలి. ◆ కవరు మీద 'ప్రజాశక్తి కథల పోటీకి' అని స్పష్టంగా 'స్నేహ' డెస్క్, ప్రజాశక్తి దినపత్రిక, అజామాబాద్ ఇండస్ట్రీయల్ ఏరియా, హైదరాబాద్ - 500020

బహుమతి పొందిన కథలతో పాటు సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు స్వీకరించవచ్చు. ఈ కథలు ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురితమవుతాయి. అలా ప్రచురించే కథలకు సాధారణ పారితోషికం వుంటుంది. అనుభవజ్ఞులైన ప్రముఖ రచయితలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రజాశక్తి సాహితీ సంస్థదే తుది నిర్ణయం.

వి. కృష్ణయ్య, చైర్మన్, ప్రజాశక్తి సాహితీ సంస్థ

బాల కథ

7 చేపల కథ

అనగనగా ఓ రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. ఓ రోజు ఏడుగురు కొడుకులు వేటకెళ్లి ఏడు చేపలు తెచ్చారు. వాటిని ఎండబెట్టారు. అన్నీ చేపలు ఎండాయి. కానీ ఒక చేప ఎండలేదు. "చేపా చేపా ఎందుకు ఎండలేదు?" అని అడిగితే... "నాకు గడ్డివాము అడ్డమొచ్చింది" అంది. "గడ్డివాము గడ్డివామూ చేపకెందుకు అడ్డమొచ్చావు" అంటే.... అప్పుడు గడ్డివాము "నన్ను ఆవు మేయలేదు" అంది. "ఆవు.. ఆవు.. గడ్డినెందుకు మేయలేదు?" అనడిగితే... "నన్ను పాలేరు విప్పలేదు" అని చెప్పింది. "పాలేరూ.. పాలేరూ ఆవుని ఎందుకు విప్పలేదు?" అంటే... "మా అమ్మాయి ఏడుస్తుంది అంటాడు. "పాపా పాపా ఎందుకు ఏడుస్తున్నావు" అంటే "నన్ను చీమ కుట్టింది" అంటుంది. "చీమా చీమా ఎందుకు పాపను కుట్టావు" అని అడిగితే "నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా" అంది.

రాజుపాలెం శశాంక్, 3వ తరగతి,
లయన్స్ మాంటిస్సోరి స్కూల్,
పెదనందిపాడు, గుంటూరు.

బాలనేస్తాలు

ఆహ్వానం

హాయ్ నేస్తాలూ! మీరు కథలు, కవితలు, బాగా రాస్తారట కదా. జోక్స్ బొమ్మలు, సూపర్‌గా వేస్తారట. మీకు బోలెడన్ని తమాషా ప్రశ్నలు - జవాబులు, చారిత్రక ఘట్టాలు తెలుసంట కదా. మరి అవన్నీ ఎంచక్కా పోస్టు కార్డుమీద రాసి పంపండి. మీ పేరు, స్కూల్‌తో సహా ప్రచురిస్తాం.

<u>మా చిరునామా</u>

బాలనేస్తాలు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజమాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

తెలుసా?

పిల్లలూ... పక్కనున్నది ఓ దేశపు జాతీయ జెండా. అది ఏ దేశానిదో చెప్పాలి. మీకో చిన్న క్లూ. చిన్న దేశమైనా క్రికెట్ ఆటలో మన దేశానికి పోటీగా నిలుస్తుంది. మనకు పొరుగు దేశమే.



కనిపెడతారా!

నేస్తాలూ...కింద ఓ బొమ్మ ఉంది. దాని పక్కనే కొన్ని ఆకారాలు ఉన్నాయి చూశారుగా. అవి ఈ బొమ్మలో ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి. ఎన్ని ఎక్కువ వెతికి పట్టుకుంటే అంత గొప్ప.



ఏడు తేడాలు

పిల్లలూ...కింది రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. కానీ వాటిలో ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.







చేరేదెలా!

బుజ్జాయిలూ...చూడండి! పైన ఓ అంకుల్ అవతలి వైపున్న జిరాక్స్ మిషన్ దగ్గరికి అర్జంటుగా వెళ్లాలనుకుంటున్నారు. కానీ చూస్తే ఎదురు దారులన్నీ గజిబిజి. ఏ దారిగుండా వెళ్తే త్వరగా జిరాక్స్ మిషన్‌ని చేరుకుంటారో చెప్పండి.



నాని, 2వ తరగతి.



ఉదయ్, 2వ తరగతి.

ఎలా పంచాలి?

రెండు ఎడ్లు పోతూ ఉన్నాయి. ముగ్గురు అన్నదమ్ములు పంచుకోవాలి. ఎలా?



తమాషా ప్రశ్న

ఎక్కడుంది?

బుజ్జాయిలూ...ఈ బొమ్మలో మీకు ఏం కనిపిస్తుంది? ఓ అమ్మాయి అందమైన టోపీ పెట్టుకుని అటువైపు తిరిగింది కదూ. కానీ ఇందులోనే మరో చిత్రం కూడా ఉంది. అదేంటో కనిపించాలంటే పుస్తకాన్ని కాస్త దూరంగా పెట్టి చూడండి.

నల్లంచిగాడు

ఈ వారం చెప్పుకోబోయే పక్షి నల్లంచిగాడు. ఇది గ్రామాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పక్షి ఆగి ఆగి పరుగెత్తుతుంటుంది. ఆహారం కోసం ఇళ్లల్లోకి కూడా వస్తుంది. కీటకాలను, ఆకు పురుగులను ఆహారంగా తీసుకుంటుంది. ఇంకా చెదపురుగులను చాలా ఇష్టంగా తింటుంది. దీని అరుపు చాలా ఉత్సాహంగా ఈల వేసినట్లు ఉంటుంది. మెత్తగా ఉండే చెట్ల వేర్లతో, పచ్చగడ్డితో గూడు కట్టుకుంది. దీని ప్రత్యేకతేంటంటే పాము కుబుసంతో గూటిని అలంకరిస్తుంది. ఈ జాతిలో మగ పక్షి చాలా చురుగ్గా ఉంటుంది. దీని తోక పైకి ఎత్తినట్లు ఉంటుంది. రెక్కల మీద తెల్లని మచ్చ ఉంటుంది. కానీ ఎగిరేటప్పుడు మాత్రమే అది కనిపిస్తుంది. ఆడపక్షి శరీరం బూడిద రంగులో, తోక కింది భాగం లేత రంగులో ఉంటుంది.



విహంగం

మాటల కోట - 75

రూపకల్పన: కొమ్మాలపాటి



అడ్డం

1. వంద పరుగులు (3)
3. రమ్మని పిలవండి (2)
7. చూడచక్కనివాడు (4)
8. అడ్డం ఒకటిలో ఉన్న అంకె హిందీలో (1)
9. వాన చుక్క (3)
10. అల్లు అర్జున్ పెళ్లి కొడుగ్గా తీసిన చిత్రం (3)
11. ఆ రోజు రాత్రి కన్ను పొడుచుకున్నా కానరాదు మరి (4)
13. నిద్రలో ఉన్నట్టే (3)
14. పడవ నడపాలంటే ఇది కావాల్సిందే (2)
15. అభిమానులు చిరంజీవిని ఇలా అంటారు (2)
16. అబ్బో... చాలానే (2)
19. పొదుపు లాంటిదే (3)
20. దానం చేసేది అతనైతే 'దానయ్య'. ఆమైతే... (3)
21. మూడు అయిదులు (4)
23. తుంపు, చివరి అక్షరం 'క' వత్తు పోయింది (2)
24. కోయిల (5)

నిలువు

2. ఇది వుంటేనే 'ప్రతి చర్య' (2)
4. అందరికీ మామ (4)
5. ఇష్టం లేకుండా ఏదైనా చేయాల్సి వస్తే... ఇది మొదలెడతాం. చిందరవందరగా (4)
6. సీతారాముల గురించి లవకుశులు పాడే పాట తొలి పదం... (3)
9. రామ్‌చరణ్ తొలి చిత్రం (3)
10. షడ్రుచుల్లో ఇది ఒకటి (3)
11. ఆటంకం (2)
12. ఎప్పటికీ నిల్చివుండే రాయి. నగల్లో వాడతారు (2)
13. పేరులో చేపలను కలిగిన పట్నం (5)
14. శ్వేత వర్ణం (3)
16. కత్తికి వుండేది (3)
17. హమేషా (2)
18. విక్రయము (4)
19. 'అష్టాచమ్మా' హీరోయిన్‌కు ఇష్టమైన పేరు (3)
22. చేలో వేసిన ఓదెల పోగు (2)

మాటలకోట - 74 జవాబు

1 గ	ణ	2 ప	3 తి		4 ఔ	5 ష	ధ	6 ము
దా		7 వ	న	8 రు		ష్టి		సు
9 ఫీ	10 వ	ర్		11 ద్రా	క్ష		12 పా	రు
	జీ		13 కా	ణి		14 అ	ర	
15 తి	రు	16 గ	లి		17 ల	క్ష		18 పో
న		డి		19 నా		20 రా	రా	
21 ఆ	22 శ		23 అ	వ	24 త	ల		25 ఏం
	26 ప	రు	వం		డి		27 ల	గె
28 ర	థం		29 తి	ల	క	ము		ల్స్

హ్హా... హ్హా...

బండివాడి తెలివి

ఒక పట్టణ వాసి ఒకరోజు కారుతో పల్లెటూరు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కారు ఒక గోతిలో దిగబడింది. ఎంత ప్రయత్నించినా ఇంకా లోతులోకి దిగుతోందే తప్ప బయటకు రావటం లేదు. ఆ సమయంలో గుర్రపు బండివాడు అటుగా వచ్చాడు. గోతిలో పడిన కారును తీసేందుకు సాయం చేయగలవా అని బండివాడిని కారు యజమాని అడిగాడు. అయ్యో అదెంత పని బాబూ, ఒకరికి ఒకరు సాయం చేసుకోకపోతే ఎలా అంటూ తన దగ్గరున్న గట్టితాడుతో గుర్రానికి, కారుకు కట్టి లాగవే రౌడీ రాణీ అంటూ అదిలించాడు. గుర్రం కదల్లేదు మెదల్లేదు. రైతు మరోసారి ప్రయత్నించి బయటకు లాగవే చండీ అని అరిచాడు. అయినా కదల్లేదు. దాంతో మూడోసారి లాగవే చల్‌చల్ అన్నాడు. అయినా కదల్లేదు. చివరకు నాలుగోసారి పరుగెత్తే పంచకల్యాణీ అన్నాడు. ఆశ్చర్యం ఒక్క ఊపున కారు గోతి నుంచి బయటకు వచ్చింది. కారు యజమాని ఆశ్చర్యపోయాడు. అదేమిటి ముందు మూడుసార్లు గుర్రం కదల్లేదు అని అడిగాడు. బాబూ నా పంచకల్యాణికి కళ్లు సరిగా కనపడవు. కారును లాగేది తానొక్కతే అనుకొని ముందు ఎలాంటి ప్రయత్నం చేయలేదు దాని సంగతి నాకు తెలుసు బాబూ అన్నాడు.

- సత్య

కష్టార్జితం

మీనాక్షమ్మ పచ్చళ్లు పెట్టడంలో మహా అనుభవశాలి. చాలా రుచిగా పెడుతుంది. ఆమె పెట్టిందంటే ఏ నిల్వ పచ్చడైనా సరే సంవత్సరం మొత్తం కొత్త పచ్చడిలా ఉంటుంది. అందుకే ఆ ఊళ్లో వాళ్లే కాకుండా చుట్టుపక్కల ఊళ్ల వాళ్లు కూడా ఆమెతో పచ్చళ్లు పెట్టించుకునేవారు. నిమ్మ, చింత, మామిడి, ఉసిరి, టమాట, దబ్బ, దోస ఇలా ఏ కాలంలో ఏవి దొరికితే వాటితో పచ్చళ్లు పెట్టేస్తుంది. ఇలా పచ్చళ్లు పెట్టి ఎంతో కొంత డబ్బు సంపాదించుకునేది.

మీనాక్షమ్మకు చాలా కాలంగా ఓ కోరిక ఉంది. బంగారపు ఉంగరం చేయించుకోవాలని. కానీ తన సంపాదన ఇంటి ఖర్చులకు, తిండికే బొటాబొటిగా సరిపోయేది. ఇక వచ్చిన సంపాదనలో మిగుల్చుకుందామన్నా మిగిలేది కాదు. ఎలాగైనా ఉంగరం చేయించుకుందామనుకుంది. అందుకోసం పచ్చళ్లు పెట్టడమే కాకుండా, ఇంకా చిన్న చిన్న పనులు కూడా చేసి డబ్బు కూడబెట్టింది. అనుకున్నట్లుగానే పొదుపు చేసి, కష్టపడి సంపాదించిన డబ్బుతో ఓ ఉంగరం చేయించుకుంది. దానిమీద మీనాక్షమ్మ అని పేరు కూడా రాయించుకుంది. ఆ ఉంగరాన్ని పెట్టుకుని చూసుకుంటూ ఎంతగానో మురిసిపోయేది.

ఆ వూరి జమిందారు రాఘవయ్య కూడా ఇంట్లోకి కావాల్సిన ఏ పచ్చడైనా మీనాక్షమ్మతోనే పెట్టించునేవాడు. జమిందారు కొడుక్కి పెళ్లి కుదిరింది. ఆయన పెళ్లికి కూడా మీనాక్షమ్మతోనే పచ్చళ్లు పెట్టించాలనుకుని ఆమెని పిపించాడు జమిందారు. అది మామిడికాయల సీజన్. మీనాక్షమ్మ మామిడికాయలు కోసి చక్కగా ఆవకాయ పచ్చడి పట్టింది. జాడీల్లో పెట్టి జాగ్రత్త చేసింది. జమిందారు ఇచ్చిన డబ్బు పుచ్చుకుని ఇంటికి వెళ్లింది.

రాత్రి ఏవో ఇంట్లో పనులు చేసుకుంటూ తన చేతిని చూసుకుంది. ఉంగరం వేలు బోసిగా ఉంది. ఉంగరం కనిపించలేదు. ఎక్కడ పడ్డదో అని ఇల్లంతా వెతికింది. కానీ ఎక్కడా కనిపించలేదు. దార్లో ఎక్కడైనా పడిందేమోనని జమిందారు ఇంటి వరకు వెతుక్కుంటూ వెళ్లింది. ఐనా ఎక్కడా కనిపించలేదు.

"అయ్యో ఉంగరం పోయింది. సరిగా తినీ తినకుండా, పొదుపు చేసి డబ్బు కూడబెట్టాను. ఎంతో కష్టపడి చేయించుకున్న ఉంగరం కనిపించలేదు" అని చాలా బాధపడింది. ఎవరికైనా దొరికిందేమోనని కనిపించిన వాళ్లందర్నీ అడిగింది. అందరూ మేం చూడలేదంటే మేం చూడలేదన్నారు. ఇక ఉంగరం పోయిందనే నిశ్చయానికొచ్చి చాలా రోజుల పాటు దిగులుపడింది.

కాలం గడుస్తోంది. మళ్లీ మామిడికాయల సీజన్ వచ్చింది. జమిందారు మళ్లీ పచ్చడి పెట్టించుకోడానికి మీనాక్షమ్మకు కబురు పంపారు. ఆమె వెళ్లి ఆవకాయ పచ్చడి తయారు చేసింది. జాడీలో పెడదామని చూస్తే అందులో అడుగున పాత ఆవకాయ పచ్చడి ఉంది. దాన్ని తీసి ఓ గిన్నెలో పెట్టింది. అయితే ఆ పచ్చడిలో మిలమిలా మెరుస్తూ ఏదో కనిపించింది. ఏమిటా అని చూస్తే తను పోగొట్టుకున్న ఉంగరమే. దాన్ని తీసుకెళ్లి జమిందారు గారికి చూపించింది. పోయినసారి ఆవకాయ పెట్టినప్పుడు అది జారి పచ్చడిలో పడిపోయిందని, ఇప్పుడు కనిపించిందని ఆయనకు సంతోషంగా చెప్పింది.

జమిందారు ఆ ఉంగరాన్ని తీసుకుని చూశాడు. దానిమీద 'మీనాక్షమ్మ' అని పేరు కూడా ఉండడంతో ఆమెకు తిరిగి ఇచ్చేస్తూ "ఇది నీ కష్టార్జితం. అందుకే మళ్లీ నీ దగ్గరికే చేరింది. అంతేకాదు, ఈ ఉంగరం నీదని తెలిసినా మాకు చూపించావు. నీ నిజాయితీని అభినందిస్తున్నాను" అంటూ ఆమెకు పచ్చడి పెట్టినందుకే కాకుండా, అదనంగా మరికొంత డబ్బు బహుమతిగా ఇచ్చాడు.

ఆ బహుమతి తీసుకుని, ఉంగరాన్ని వేలికి పెట్టుకుని సంతోషంగా ఇంటికి చేరింది మీనాక్షమ్మ.

- పి. జ్యోతి.

కలప కళ

మనసుంటే మార్గముంటుందన్నది పెద్దల మాట. ఆ మాటను కళాత్మకంగా చూస్తే...ఆచరిస్తే... ఇదిగో ఇలాంటి కళాఖండాలే కళ్లముందుంటాయి. నింగి, నేల, నీటిపై నివసించే ప్రాణికోటిని కలపపై ఆవిష్కరిస్తే ఎలా వుంటుందన్న ఆలోచనే అద్భుతం. ఆ అపురూపమైన ఆలోచన పాల్ బాలికర్ మదిలో మెదిలింది. ఆయన గత 35 సంవత్సరాలుగా ఇలాంటి కలప కళాఖండాలు సృజిస్తున్నాడు. ఈ ఒక్క కళాఖండమే 13 అడుగుల వెడల్పుంది. దీన్ని పాల్ ఓ గడియారంలా రూపొందించాడు. మనిషికి ... భూమి మీదున్న ప్రాణి కోటికి వున్న అనుబంధాన్ని దీని ద్వారా తెలియచెప్పాడు. 12 గంటల దగ్గర నుంచి పరిశీలనగా చూడండి. గంట గంటకు ఒక ప్రాణిని ప్రతిష్ఠించాడు. మధ్యలో మనిషి చేతిలో భూమిని వుంచాడు. ఎంత భావగర్భితంగా వుందీ కళాఖండం!